FOR ADS......
ఆకాంక్ష
CONTACT :
8333818121

# తొలి ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను

ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ... అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..

సంప్రదించండి...

8333818121

ఎడిటర్ పెనగొండ సతీష్ — తొలి ఆకాంక్ష

ప్రచురణ : తెలంగాణ   సంపుటి : 01   సంచిక :211   ఎడిటర్ : పెనగొండ సతీష్   పేజీలు : 08,   వెల. 5రూ/   బుధవారం- 25 - మార్చి - 2026

## కొండంత రాగం తీసి కూసింత పాట పాడినట్లుగా ఈ జాబ్ క్యాలెండర్ ఉంది



రాష్ట్రవ్యాప్తంగా 1.80 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉంటే, కేవలం 10 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఇది యువతను మోసం చేయడమేనని ఆమె ఆరోపించారు.

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నాడు విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కొండంత రాగం తీసి కూసింత పాట పాడినట్లుగా ఈ క్యాలెండర్ ఉందని, ఇది యువతను మోసం చేయడమేనని ఆమె ఆరోపించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను నిరాశపరిచారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.80 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉంటే, కేవలం 10 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడం యువతకు అన్యాయం చేయడమేనని షర్మిల పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన క్యాలెండర్ చూసి అంతా తుస్సుమనిపించిందని వ్యాఖ్యానించారు. మిగతా..2లో

## హైదరాబాద్‌లో దంచికొడుతున్న వర్షం



హైదరాబాద్ నగరంలో వర్షం దంచికొడుతుంది. కూకట్‌పల్లి, మియాపూర్, ఫిల్మ్ నగర్ వంటి పలు ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షం కురుస్తోంది.

ఒక్కసారిగా కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. ఎండలతో ఇబ్బంది పడుతున్న నగర ప్రజలకు ఈ వర్షం కొంత ఊరటనిచ్చింది.

హైదరాబాద్: నగరంలో పలు ప్రాంతాల్లో వర్షం దంచికొడుతోంది. మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా మేఘాలు కమ్ముకోవడంతో వాతావరణం మారిపోయింది. కూకట్‌పల్లి, చందానగర్, మియాపూర్ ప్రాంతాల్లో గట్టిగా వర్షం కురుస్తోంది. రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక సూరారం, కొంపల్లి, దుండిగల్ ప్రాంతాల్లో కూడా మోస్తరు వర్షపాతం నమోదవుతోంది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. ఎండలతో ఇబ్బంది పడుతున్న నగర ప్రజలకు మిగతా..2లో

## బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను సిగ్గులేకుండా వారి ఖాతాలో వేసుకుంటున్నారు




- తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను నయవంచన చేశారని ఆయన ఆరోపించారు.
- ఎన్నికల ముందు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక దానికి పాతరేశారని మండిపడ్డారు.

హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గులేకుండా తమ ఖాతాలో వేసుకుంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికల ముందు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక దానికి పాతరేశారని మండిపడ్డారు. తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను నయవంచన చేశారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

## బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డికి సీతక్క కౌంటర్

- గత పదేళ్లుగా వికలాంగులు, వితంతువుల పెన్షన్లు పెంచలేదు కానీ..
- పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారంటూ బీజేపీ నేతలపై తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మండిపడ్డారు.
- మంగళవారం తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ శాసన సభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి విమర్శలు గుప్పించారు.
- అసెంబ్లీలో మహేశ్వర్ రెడ్డికి సీతక్క కౌంటర్ ఇచ్చారు.



హైదరాబాద్, మార్చి 24: గత పదేళ్లుగా వికలాంగులు, వితంతువుల పెన్షన్లు పెంచలేదు కానీ.. పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారంటూ బీజేపీ నేతలపై తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ శాసన సభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో మహేశ్వర్ రెడ్డికి సీతక్క కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కేంద్రం ఏ రకంగా మద్దతు ఇవ్వకున్నా ప్రజాసంక్షేమం కోసం తమ ప్రభుత్వం అధికంగా నిధులు వెచ్చిస్తుందన్నారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా.. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తెచ్చే బాధ్యత మీకు లేదా? అంటూ వారిని సూటిగా ప్రశ్నించారు. వ్యవసాయంపై కేంద్రం నల్ల చట్టాలు తీసుకు వస్తే.. దీనిపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటం చేశారన్నారు. దాంతో కేంద్రం వెనక్కి తగ్గిందని సీతక్క గుర్తు చేశారు. దేశంలో బడా పారిశ్రామికవేత్తలకు చెందిన రూ.16 లక్షల కోట్లను రుణమాఫీ చేశారు కానీ రైతు రుణమాఫీ మాత్రం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త రేషన్ కార్డు ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. వడ్డీ లేని రుణాల మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ బీజేపీ నేతల వైఖరిని ఈ సందర్భంగా ఎండగట్టారు. మిగతా..2లో

## విజయవాడకు మూడు గంటల్లో చేరే విధంగా రహదారి నిర్మాణం

- ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం
- కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో చేర్చిన తరువాత డీపీఆర్ తయారు చేస్తారని అసెంబ్లీలో కోమటిరెడ్డి ప్రకటన




హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో చేర్చిన తరువాత డీపీఆర్ తయారు చేస్తారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. విజయవాడ రహదారి ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు ట్రాఫిక్ రద్దీగా ఉందని, రామోజీ ఫిల్మ్ సిటీ దాటిన తరువాత ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు కావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి

## ఒకే దేశం, ఒకే చట్టం: గుజరాత్ లో యూనిఫాం సివిల్ కోడ్ !




- గుజరాత్ లో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) బిల్లు ప్రవేశపెట్టిన సీఎం భూపేంద్ర పటేల్
- "ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో అనేక విప్లవాత్మక సంస్కరణలు జరిగాయి.

ఢిల్లి : ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేసేందుకు గుజరాత్ ప్రభుత్వం సిద్ధమవుతోంది. అందులో భాగంగా యూనిఫాం సివిల్ కోడ్ బిల్లు-2026ను గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రాష్ట్రప్రభుత్వం నియమించిన కమిటీ యూసీసీ అమలుపై తుది నివేదికను సమర్పించిన వారం రోజుల తర్వాత ఈ బిల్లును అసెంబ్లీ ముందుకు తీసుకురావడం గమనార్హం.

## మరో ఆరు రెడీగా ఉన్నాయన్న కేంద్రం

- హర్మూజ్ దాటిన రెండు భారత ఎల్ పీజీ నౌకలు
- హర్మూజ్ నుంచి సురక్షితంగా బయటపడిన 'పైన్‌గ్యాస్', 'జగ్ వసంత్' అనే మరో రెండు భారతీయ ఎల్‌పీజీ ట్యాంకర్లు



ఢిల్లి : పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతల నడుమ ఇరాన్ సరిహద్దులోని హోర్ముజ్ జలసంధి నుంచి 'పైన్‌గ్యాస్', 'జగ్ వసంత్' అనే మరో రెండు భారతీయ ఎల్‌పీజీ ట్యాంకర్లు సురక్షితంగా బయటపడ్డాయి. ఇందుకు సంబంధించిన వీడియోలను ప్రభుత్వ వర్గాలు విడుదల చేశాయి. దేశవ్యాప్తంగా ఒక రోజు వినియోగానికి సరిపడా సుమారు 92వేల 612 టన్నుల వంటగ్యాస్‌ను ఈ నౌకలు మోసుకొస్తున్నాయి. లారక్, ఖేష్మ్ ద్వీపాల మీదుగా ప్రయాణించిన ఈ నౌకల్లో ఒకదానిలో 33, మరోదానిలో 27 మంది భారత నావికులు ఉన్నారు. మార్చి 26 నుంచి 28 మధ్య భారత తీరానికి చేరుకోనున్నాయి. ఇప్పటికే శివాలిక్, నందా దేవి వంటి గ్యాస్ నౌకలు సురక్షితంగా భారత్ చేరుకోగా, తాజా నౌకల రాకతో దేశ ఇంధన అవసరాలకు కొంత ఊరట లభించనుంది.

**హర్మూజ్ జలసంధిని దాటడానికి ఎలాంటి అనుమతి అవసరం లేదు :**

మిగతా..2లో

## ఇరాన్ కొత్త సెక్యూరిటీ చీఫ్‌గా మహమ్మద్ జోల్‌ఘాద్

- పశ్చిమాసియాలో భీకర పోరు కొనసాగుతోంది. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తమ ప్రతీకార దాడులను మరింత తీవ్రతరం చేసింది.
- ఇజ్రాయెల్‌లోని కీలక ప్రాంతాలతో పాటు, పశ్చిమాసియాలోని పలు అమెరికా సైనిక స్థావరాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది.
- ఇరాన్ ప్రయోగించిన 19 డ్రోన్లను ధ్వంసం చేసిన సౌదీ రక్షణ బలగాలు




ఢిల్లి :సౌదీ అరేబియాలోని చమురు నిక్షేపాలున్న తూర్పు ప్రావిన్స్‌ను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ప్రయోగించిన 19 డ్రోన్లను సౌదీ రక్షణ బలగాలు ధ్వంసం చేశాయి. బహ్రెయిన్‌లో క్షిపణి హెచ్చరిక సైరన్లు మోగాయి. డ్రోన్ దాడుల కారణంగా బహ్రెయిన్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. బహ్రెయిన్ రీజియన్‌లో సేవలను పూర్తిగా పునరుద్ధరించే వరకు, ప్రభావితమైన తమ కస్టమర్లను ఇతర ప్రత్యామ్నాయ "ఆ" రీజియన్లకు మార్చేందుకు అవసరమైన సహాయం అందిస్తున్నట్లు అమెజాన్ స్పష్టం చేసింది.

## ప్రతి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తా ప్రజాదర్బార్ లో నారా లోకేశ్ హామీ




- టీడీపీ కేంద్ర కార్యాలయానికి పోటెత్తిన ప్రజలు, కార్యకర్తలు
- అర్జీలు స్వీకరించిన మంత్రి కేబుల్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి హామీ
- న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని వినతులు

అమరావతి : ఏపీ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చేపట్టిన 'ప్రజా దర్బార్' విజయవంతంగా కొనసాగుతోంది. ప్రజల కష్టాలు నేరుగా వినడానికి, వారి సమస్యలు తీర్చడానికి ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు.

## మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం

"మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం. ప్రజలు ఇచ్చిన అధికారంతో ప్రతీ రంగంలో, ప్రతీ ప్రాంతంలో మార్పు తెచ్చి చూపిస్తున్నాం.

నేడు అభివృద్ధి, అవకాశాలు, ఆకాంక్షలతో అన్ని చోట్లా ఆనందాన్ని, భవిష్యత్ పై భరోసాను తీసుకువచ్చాం.

గౌరవ ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లనే 21 నెలల్లో ఇంత పెద్ద ప్లాంట్‌ను రాష్ట్రానికి తీసుకురాగలిగాం.



అమరావతి : ఏపీలో ప్రతిష్ఠాత్మకమైన ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు నిన్న అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద శంకుస్థాపన జరగడం తెలిసిందే. దీనిపై సీఎం చంద్రబాబు నేడు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఓ దిక్సూచి అని అభివర్ణించారు. డబుల్ ఇంజన్ సర్కారుతోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ సాధ్యమైందంటూ ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. "మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం. ప్రజలు ఇచ్చిన అధికారంతో ప్రతీ రంగంలో, ప్రతీ ప్రాంతంలో మార్పు తెచ్చి చూపిస్తున్నాం. ఉత్తరాంధ్రలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ రాకతో గొప్ప ముందడుగు వేశాం. 21 నెలల క్రితం కబ్జాలు, కూల్చివేతలు, కేసులతో అభద్రత, భయం, మానసిక క్షోభతో అల్లాడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో... మిగతా..2లో

## అమరావతిలో సీసీ కెమెరాలు తప్పనిసరి... వరుస అగ్నిప్రమాదాలపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

- ★ కూటమి ప్రభుత్వం ఏర్పడి, రాజధానిలో పనులు ఊపందుకున్న తర్వాత జరుగుతున్న వరుస ఘటనలపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు.
- ★ నిర్మాణ సంస్థలు కూడా తమ వంతుగా సామగ్రి నిల్వ కేంద్రాల వద్ద వ్యక్తిగత భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం




అమరావతి :రాజధాని అమరావతి నిర్మాణ ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. పనులు వేగంగా జరుగుతున్న సమయంలో వరుసగా చోటుచేసుకుంటున్న అగ్నిప్రమాదాల నేపథ్యంలో, ప్రతి నిర్మాణ సంస్థ తమ సామగ్రి నిల్వచేసే యార్డులో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. రాజధానిలో భద్రతా వైఫల్యాలకు ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి, రాజధానిలో పనులు ఊపందుకున్న తర్వాత జరుగుతున్న వరుస ఘటనలపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. రాయపూడి వద్ద హెచ్‌వోడీ టవర్ల నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో ఓ సంస్థకు చెందిన పైపులు దగ్ధమైన ఘటనపై సచివాలయంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ కుమార్ లడ్డా, గుంటూరు ఎస్పీ వకుళ్ జిందాల్‌తో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

మొదటి పేజి తరువాయి

## మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం: సీఎం చంద్రబాబు

నేడు అభివృద్ధి, అవకాశాలు, ఆకాంక్షలతో అన్ని చోట్లా ఆనందాన్ని, భవిష్యత్ పై భరోసాను తీసుకువచ్చాం. ఆంధ్రుల హక్కు అని పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ మన ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిస్తే... ఇప్పుడు అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు అవుతున్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా పరిశ్రమ ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు నూతన దిక్సూచి అవుతుంది. రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఏర్పాటు అవుతున్న ఉక్కు కర్మాగారం ఉత్తరాంధ్రను ఉక్కు ఆంధ్రాగా మారుస్తుంది. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో ఉక్కు రంగంలో ఏపీ దేశంలో అత్యున్నత స్థానానికి చేరుకుంటుంది. గౌరవ ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లనే 21 నెలల్లో ఇంత పెద్ద ప్లాంట్‌ను రాష్ట్రానికి తీసుకురాగలిగాం. ప్లాంట్‌కు అవసరమైన ముడి ఖనిజం సరఫరా నుంచి అనుమతుల వరకు కేంద్రం వేగవంతమైన, సానుకూల నిర్ణయాలతో ప్రతి దశలోనూ ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చింది. డబుల్ ఇంజన్ సర్కారు ప్రగతిశీల నిర్ణయాల వల్లనే ఈ ప్రాంతంలో ఒక స్టీల్ సిటీ నిర్మితమవుతోంది. యువతకు లక్షల సంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయి. వచ్చే మూడేళ్లలోనే ఈ ప్రాంతంలో అన్ని రంగాల్లో, అన్ని విధాలా అభివృద్ధి ఫలాలు అందుతాయి. భారతదేశంలోనే అతి పెద్ద స్టీల్ ప్లాంట్‌కు అడుగులు పడిన సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజలకు శుభాకాంక్షలు" అంటూ సీఎం చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.

## అమరావతిలో సీసీ కెమెరాలు తప్పనిసరి... వరుస అగ్నిప్రమాదాలపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

ఈ వరుస ఘటనలు ప్రమాదవశాత్తు జరుగుతున్నాయా, లేక వీటి వెనుక కుట్ర కోణం ఏమైనా ఉందా అనే విషయంపై నిగ్గు తేల్చాలని అధికారులను ఆదేశించారు. ఘటన జరిగిన తీరు, అంత త్వరగా మంటలు వ్యాపించడానికి గల కారణాలను ఫోరెన్సిక్ ఆధారాలతో సహా వెలికితీయాలని సూచించారు. సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "రాజధానిలో పెద్దఎత్తున నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కోట్ల విలువైన సామగ్రిని నిల్వ చేశారు. ఇలాంటి సమయంలో జరుగుతున్న ఘటనల వల్ల పనులకు అనవసర అడ్డంకులు ఏర్పడతాయి. కాబట్టి పటిష్ఠ చర్యలు తీసుకోవాలి" అని అన్నారు. రాజధాని ప్రాంతంలో అదనపు పెట్రోలింగ్ నిర్వహించాలని, డ్రోన్ కెమెరాల ద్వారా భద్రతను పర్యవేక్షించాలని సూచించారు. నిర్మాణ సంస్థలు కూడా తమ వంతుగా సామగ్రి నిల్వ కేంద్రాల వద్ద వ్యక్తిగత భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. అనుమానితుల కదలికలపై నిఘా పెట్టాలని, వారి రాకపోకలను గమనిస్తూ అవసరమైతే ప్రశ్నించాలని ముఖ్యమంత్రి తెలిపారు. రాజధానిలో అలజడి సృష్టించాలని ఎవరైనా ప్రయత్నిస్తున్నట్లు తేలితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని, అలాంటి వారిపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవాలని చంద్రబాబు పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు.

## హైదరాబాద్‌లో దంచికొడుతున్న వర్షం

ఈ వర్షం కొంత ఊరటనిచ్చింది. అయితే, వర్షం కారణంగా ట్రాఫిక్ రద్దీ పెరిగింది. ముఖ్యంగా ప్రధాన రహదారులపై వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశముందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికల మేరకు రాబోయే గంటల్లో కూడా నగరంలో మరిన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని, వర్షం సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

## బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డికి సీతక్క కౌంటర్

బ్యాంకింగ్ రుణాల కింద రూ.58 వేల కోట్ల మంజూరు చేశామని సీతక్క గుర్తు చేశారు. అలాగే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామన్నారు. ఉచిత విద్యుత్, సన్న వడ్లతోపాటు రూ. నాలుగున్నర లక్షల కోట్లతో ఇందిరమ్మ ఇండ్లు కడుతున్నామని తెలిపారు. మీ ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రజలకు పని లేదన్నారు. రైతులకు ప్రతి నెల పెన్షన్స్ ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చిందన్నారు. అదే విధంగా విదేశాల్లోని నల్లధనాన్ని తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని ప్రకటించారని చెప్పారు. రూ. 50కే లీటర్ పెట్రోల్ ఇస్తామన్నారని సీతక్క గుర్తు చేశారు. కానీ పెట్రోల్ ధరలు ఇష్టారాజ్యంగా పెంచారంటూ కేంద్రంపై నిప్పులు చెరిగారు. విభజన హామీలు నెరవేర్చకుండా వట్టిగా ప్రసంగిస్తే ఏం ఉపయోగం అంటూ బీజేపీ నేతలకు ఈ సందర్భంగా సీతక్క చురకలంటించారు. తెలంగాణ ప్రజలు చెల్లించే పన్నులు కావాలి కానీ.. ఆ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు మాత్రం పట్టవా అంటూ బీజేపీ నేతలను ఈ సందర్భంగా నిలదీశారు. గత ప్రభుత్వ తీరు వల్ల ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని సీతక్క స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆర్థిక చేయూతతో నాలుగు లక్షల 70 వేల మంది మహిళలు వ్యాపారాలు చేసుకుంటున్నారని వివరించారు. కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేస్తామని సంకల్పంతో తాము పని చేస్తున్నామన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఎగతాళి చేయడం మీకే చెల్లిందంటూ బీజేపీ శాసన సభ పక్ష నేత మహేశ్వరరెడ్డి తీరును ఈ సందర్భంగా మంత్రి సీతక్క ఎండగట్టారు.

## బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను సిగ్గులేకుండా వారి ఖాతాలో వేసుకుంటున్నారు

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందన్న డిమాండ్లతో అసెంబ్లీ ముట్టడికి యత్నించిన బీఆర్ఎస్ విద్యార్థి నేతలను అరెస్టు చేయడం దుర్మార్గమని కేటీఆర్ అన్నారు. బడ్జెట్ సమావేశాల సమయంలోనైనా నిధులు విడుదల చేయాల్సిందిపోయి, ప్రశ్నించిన గొంతుకలపై ఉక్కుపాదం మోపడం రాష్ట్రంలో ఎమర్జెన్సీ వాతావరణాన్ని తలపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీల అమలు కోసం విద్యార్థులు అసెంబ్లీని ముట్టడించాల్సిన దుస్థితిని కల్పించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గుపడాలని హితవు పలికారు. విద్యాశాఖ మంత్రిగా కూడా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యం వల్లే రాష్ట్రంలో విద్యావ్యవస్థ కుప్పకూలిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, పేద విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో 127 మంది విద్యార్థులు మరణించినా ముఖ్యమంత్రిలో కనీస చలనం లేదని, ఇప్పటివరకు దానిపై స్పందించకపోవడం ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి బకాయిపడ్డ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న మాటను మూడేళ్లు కావస్తున్న నేపథ్యంలోనైనా నిలబెట్టుకోవాలని సూచించారు. అక్రమంగా అరెస్టు చేసిన బీఆర్ఎస్వి నాయకులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## ఇరాన్ కొత్త సెక్యూరిటీ చీఫ్‌గా మహమ్మద్ జోల్‌ఘాద్

కువైట్‌పైనా ఇరాన్ దాడులు కొనసాగాయి. ఈ దాడులను అడ్డుకునే క్రమంలో పడిన శకలాల కారణంగా ఏడు ఓవర్‌హెడ్ విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్లు దెబ్బతిన్నాయి. దీనివల్ల కువైట్‌లోని పలు ప్రాంతాల్లో పాక్షికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం అలుముకుంది. ఇవాళ 5 బాలిస్టిక్ మిస్సైళ్లు, 17 డ్రోన్లను అడ్డుకున్నట్లు యూఏఈ తెలిపింది. పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతల నడుమ ఇరాన్ సరిహద్దులోని హోర్ముజ్ జలసంధి నుంచి 'పైన్‌గ్యాస్', 'జగ్ వసంత్' అనే మరో రెండు భారతీయ ఎల్‌పిజి ట్యాంకర్లు సురక్షితంగా బయటపడ్డాయి. ఇందుకు సంబంధించిన వీడియోలను ప్రభుత్వ వర్గాలు విడుదల చేశాయి. దేశవ్యాప్తంగా ఒక రోజు వినియోగానికి సరిపడా సుమారు 92వేల 612 టన్నుల వంటగ్యాస్‌ను ఈ నౌకలు మోసుకొస్తున్నాయి. లారక్, ఖేష్మ్ ద్వీపాల మీదుగా ప్రయాణించిన ఈ నౌకల్లో ఒకదానిలో 33, మరోదానిలో 22 మంది భారత నావికులు ఉన్నారు. మార్చి 26 నుంచి 28 మధ్య భారత తీరానికి చేరుకోనున్నాయి. ఇప్పటికే శివాలిక్, నందా దేవి వంటి గ్యాస్ నౌకలు సురక్షితంగా భారత్ చేరుకోగా, తాజా నౌకల రాకతో దేశ ఇంధన అవసరాలకు కొంత ఊరట లభించనుంది. పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకోవాలని చూస్తున్నారని ఇజ్రాయెల్‌కు చెందిన సీనియర్ అధికారులు ఓ అంతర్జాతీయ వార్తా సంస్థకు తెలిపారు. అయితే ట్రంప్ డిమాండ్లకు ఇరాన్ అంగీకరించకపోవచ్చనే సందేహాన్ని వ్యక్తం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమం సహా బాలిస్టిక్ క్షిపణి సామర్థ్యాలపై పరిమితులను విధించే నిబంధనలకు ఆ దేశం అంగీకరించే అవకాశం లేదని చెప్పారు.

## కొండంత రాగం తీసి కూసింత పాట పాడినట్లుగా ఈ జాబ్ క్యాలెండర్ ఉంది



ఈ నేపథ్యంలో, రాష్ట్రంలోని ఉద్యోగాల భర్తీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. వాస్తవ ఖాళీలు ఎన్ని, వాటిని ఎప్పటిలోగా భర్తీ చేస్తారో స్పష్టత ఇవ్వాలని కోరారు. దీంతోపాటు, గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని కూడా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# ప్రతి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తా - ప్రజాదర్బార్ లో నారా లోకేశ్ హామీ

మొదటి పేజి తరువాయి

మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో 85వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, కార్యకర్తలు మంత్రిని కలిసి తమ బాధలు చెప్పుకున్నారు. ప్రతి ఒక్కరి సమస్యను ఓపికగా విన్న లోకేశ్ పరిష్కారానికి భరోసా ఇచ్చారు. ఆప్యాయ పలకరింపు, అభయప్రదానం : ఉదయం నుంచే టీడీపీ ఆఫీసు దగ్గర సందడి నెలకొంది. వివిధ జిల్లాల నుంచి సామాన్య ప్రజలు, రైతులు, టీడీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మంత్రి నారా లోకేశ్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను ఓపికగా విన్నారు. స్వయంగా వారి చేతుల మీదుగా అర్జీలు తీసుకున్నారు. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగకుండా చూసుకుంటానని వారికి భరోసా ఇచ్చారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా - 85వ రోజు నారా లోకేశ్ 'ప్రజా దర్బార్'

కేబుల్ ఆపరేటర్ల సమస్యలపై సానుకూల స్పందన : ఈ ప్రజా దర్బార్‌లో ఏపీ కేబుల్ ఆపరేటర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ప్రతినిధులు మంత్రి లోకేశ్ ను కలిశారు. రాష్ట్రవ్యాప్తంగా కేబుల్ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న పలు ఇబ్బందులను ఆయన దృష్టికి



తీసుకొచ్చారు. ముఖ్యంగా ఏపీ ఫైబర్ నెట్‌కు సంబంధించి కాలం తీరిన (ఎక్స్‌పైర్ అయిన) సెట్ టాప్ బాక్సులపై వసూలు చేస్తున్న రూ. 59 రెంటల్ ఛార్జీని తక్షణమే తొలగించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని సంబంధిత మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కేబుల్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలి: ఏలూరుకు చెందిన నిమ్మల జ్యోతి కుమార్ అనే న్యాయవాది మంత్రి లోకేశ్ కు ఒక వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. విధుల్లో ఉన్న న్యాయవాదులకు తగిన రక్షణ కల్పించేలా 'అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్' (న్యాయవాదుల రక్షణ చట్టం)ను వీలైనంత త్వరగా అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారుల తీరుపై ఫిర్యాదులు : సామాన్య ప్రజలు సైతం తమ భూమి, పన్ను సమస్యలను మంత్రి లోకేశ్ ముందు ఏకరువు పెట్టారు. స్థానిక అధికారుల తీరుపై ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం అనుమర్లపూడి గ్రామానికి చెందిన ముత్తే సాంబశివరావు మంత్రిని కలిశారు. తనకు ఆ గ్రామంలో 0.81 ఎకరాల భూమి ఉందని తెలిపారు. ఆ భూమిని రెవెన్యూ రికార్డుల్లో, ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. విజయవాడలోని మొగల్రాజపురానికి చెందిన గూడపాటి కోటేశ్వరరావు తన సమస్యను విన్నవించారు. తనకు అక్కడ ఒక ఖాళీ స్థలం ఉందని తెలిపారు. అయితే, మున్సిపల్ అధికారులు వేరొక వ్యక్తి పేరు మీద అక్రమంగా ఆ స్థలానికి ఇంటి పన్ను వేశారని ఫిర్యాదు చేశారు. తప్పు చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ అక్రమ పన్నును వెంటనే రద్దు చేసి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి కృషి : ప్రజల నుంచి వచ్చిన ఈ వినతులన్నింటినీ మంత్రి నారా లోకేశ్ జాగ్రత్తగా పరిశీలించారు. ఏ ఒక్క అర్జీ బుట్టదాఖలు కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించి, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ స్పష్టమైన హామీ ఇచ్చారు.

# విజయవాడకు మూడు గంటల్లో చేరే విధంగా రహదారి నిర్మాణం

మొదటి పేజి తరువాయి

నారాయణ రెడ్డి కోరారు. అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి : శాసనసభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై ప్రశ్నించారు. అనేక కళాశాలలు ఉన్నాయని, రోడ్డు దాటాలి అంటే ఇబ్బంది పడుతున్నారని, అనేక మంది ప్రమాదానికి గురవుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. తుక్కుగూడ నుంచి శ్రీశైలం వెళ్లే రహదారిని ఆరు లైన్ల రోడ్డుగా విస్తరించాలని కోరారు. శ్రీశైలం జాతీయ రహదారిపై అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. తాండూరు నియోజకవర్గంలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుద్దారం, నాగులపల్లి రోడ్లు మంజూరు చేయాలని కోరారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని విజ్ఞప్తి : పనామా వద్ద ఫ్లై ఓవర్ మంజూరు చేయించినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో చేర్చిన తరువాత డీపీఆర్ తయారు చేస్తారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారని గుర్తు చేశారు. మంజూరు అయితే చేయించారని కానీ పనులు ఎప్పటి వరకు ప్రారంభిస్తారనేది మంత్రి సమాధానం చెప్పాలని అడిగారు. దేవాలయాలు, మసీదులు, చర్చిల వద్ద ట్రాఫిక్ జామ్ అవుతుందని, ప్రభుత్వం చొరవ తీసుకుని మత సంప్రదాయాలకు అనుగుణంగా మరొక్క చోట స్థలాలు కేటాయిస్తే, ట్రాఫిక్ రద్దీ తగ్గించవచ్చని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని రోడ్లను అభివృద్ధి చేయడమే లక్ష్యం : హైదరాబాద్ జంట నగరాల రోడ్లపైనే సభ్యులు మాట్లాడారని, నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు 65 కాలనీలు అక్కడ ఉన్నాయని, దాదాపు 12 లక్షల మంది ఉన్నారని అన్నారు. నాగపూర్ తరహాలో డబుల్ డెక్కర్ రోడ్డు కావాలని నితిన్ గడ్కరీని కోరినట్లు చెప్పారు. డబుల్ డెక్కర్ రోడ్డు ప్రపోజల్స్ పంపడం జరిగిందని మూడు,



నాలుగు నెలల్లో మంజూరు చేయించుకుని, ఆరు నెలల్లో పనులు ప్రారంభించేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయని, తెలంగాణ రాష్ట్రంలోని రోడ్లను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఏపీలోని విజయవాడకు రెండు, మూడు గంటల్లో చేరే విధంగా 6 లైన్ రోడ్

# ఒకే దేశం, ఒకే చట్టం: గుజరాత్ లో యూనిఫాం సివిల్ కోడ్ !

మొదటి పేజి తరువాయి

"ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో అనేక విప్లవాత్మక సంస్కరణలు జరిగాయి. అదే సంప్రదాయాన్ని కొనసాగించేందుకు గుజరాత్ లో యూసీసీ బిల్లును ప్రవేశపెట్టాం. మతాలు వేర్వేరుగా ఉండవచ్చు. కానీ సత్యం ఒక్కటే. న్యాయం ఒక్కటే. స్వాతంత్ర్యం వచ్చిన ఏడు దశాబ్దాల తర్వాత, దేశంలో ఏకీకృత చట్టాన్ని తీసుకురావడానికి ఒక ప్రయత్నం జరిగింది. ఈ బిల్లు గుజరాత్ పౌరుల ఆకాంక్షలను, సమగ్రతను అనుసంధానించే ఒక గొప్ప ముందడుగు. వివిధ మతాలకు, వర్గాలకు వేర్వేరు నియమాలు ఉండకూడదు. రాజ్యాంగం అందరికీ సమానంగా వర్తించినట్లే, ఈ చట్టం కూడా అందరికీ సమానంగా వర్తిస్తుంది."

**- భూపేంద్ర పటేల్, గుజరాత్ ముఖ్యమంత్రి**

గుజరాత్ అసెంబ్లీలో ఈ ఉమ్మడి పౌరస్మృతి బిల్లుపై చర్చించి, అనంతరం ఓటింగ్ నిర్వహించనున్నారు. ఈ 'గుజరాత్ యూనిఫాం



సివిల్ కోడ్ , 2026' కనుక ఆమోదం పొందితే, దేశంలో యూసీసీ బిల్లును ఆమోదించిన రెండో రాష్ట్రంగా గుజరాత్ నిలుస్తుంది. 2024 ఫిబ్రవరిలో ఉత్తరాఖండ్ సర్కార్ మొదటసారిగా ఈ బిల్లును ఆమోదించింది. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి అమలులో ఉంది.

### మతంతో సంబంధం లేకుండా!

ఉమ్మడి పౌరస్మృతి బిల్లు కనుక ఆమోదం పొందితే, మతంతో సంబంధం లేకుండా వివాహం, విడాకులు, వారసత్వం, సహజీవన సంబంధాలు నియంత్రించడానికి ఒక ఉమ్మడి చట్టం అమల్లోకి తీసుకురావచ్చు. మరీ ముఖ్యంగా ఇది సహజీవన సంబంధాలను నమోదు చేసుకోవడానికి, అలాగే అధికారిక ప్రకటన చేసి, వాటిని రుద్దు చేసుకోవడానికి వీలుకల్పిస్తుంది. వాస్తవానికి ఈ బిల్లు బహుభార్యత్వాన్ని నిషేధిస్తుంది. వివాహ సమయంలో వధూవరులు ఇద్దరికీ బతికి ఉన్న జీవిత భాగస్వామి లేకపోతేనే, ఆ పెళ్లి చట్టం ప్రకారం చెల్లుబాటు అవుతుంది.

### ఇది ఎవరెవరికి వర్తిస్తుంది?

ఈ ఉమ్మడి పౌరస్మృతి బిల్లు కనుక ఆమోదం పొందితే, అది గుజరాత్ రాష్ట్రం మొత్తానికి వర్తిస్తుంది. అంతేకాదు రాష్ట్రం వెలుపల నివసించే గుజరాతీలు కూడా దీని పరిధిలోకి వస్తారు. కానీ, ఇది షెడ్యూల్డ్ తెగలకు, రాజ్యాంగం ప్రకారం, సంప్రదాయ హక్కులకు రక్షణ కలిగి ఉన్న కొన్ని సమూహాలకు వర్తించదు.

# మీరు ఎందులో మేధావి?

పరీక్షల్లో మంచి మార్కులు వస్తే కుర్రాడు తెలివైనవాడు, చురుకైనవాడు అనేస్తాం. మన దృష్టిలో తెలివితేటలకు కొలమానం చదువూ ర్యాంకులే. కానీ మేధస్సు చాలా రకాలుగా ఉంటుంది. అందుకే చదువూ డిగ్రీలతో సంబంధం లేకుండా భిన్నరంగాల్లో రాణించేవారిని మనం చూస్తూ ఉంటాం. తన 'థియరీ ఆఫ్ మల్టిపుల్ ఇంటెలిజెన్స్'లో ఎనిమిది రకాల మేధస్సులను పేర్కొన్నారు హోవార్డ్ గార్డ్‌నర్. వీటిలో రకరకాల కాంబినేషన్లను మనుషుల్లో గమనించవచ్చంటారీ అమెరికన్ సైకాలజిస్ట్. ఆ ఎనిమిదీ ఏంటో తెలిస్తే వాటిలో మనకు ఏవేవి ఉన్నాయో చూసుకోవచ్చు కదా! లింగ్విస్టిక్ ఇంటెలిజెన్స్: భాషాపరమైన మేధావులన్నమాట. భాషపై మంచి పట్టు ఉండటంతో పద ప్రయోగాలూ సంభాషణా చాతుర్యంలో కట్టిపడేయగలిగిన వీళ్లు రచయితలుగా, కవులూ కథకులుగా, న్యాయవాదులుగా, వక్తలుగా రాణిస్తారు. లాజికల్- మ్యాథమెటికల్ ఇంటెలిజెన్స్: గణితం, తర్కం అంటే అమితంగా ఇష్టపడేవారు ఈ కోవకు చెందుతారు. ప్రతి విషయంలోనూ 'ఎందుకు? ఏమిటి? ఎలా?' అని ప్రశ్నిస్తూ, సమస్యలను శాస్త్రీయంగా విశ్లేషించగలరు. వాటికి సరైన పరిష్కారాన్ని వెతకడంలో ముందుంటారు. ఇంజినీర్లు, శాస్త్రజ్ఞులు, ఆర్థిక విశ్లేషకులుగా వీరు అద్భుతాలు సృష్టిస్తారు. స్పేషియల్ ఇంటెలిజెన్స్: వస్తువుల్ని, చిత్రాల్ని త్రీడైమెన్షన్స్‌లో చూసి అర్థం చేసుకునే శక్తి వీరి సొంతం. ఏదైనా ఖాళీ స్థలాన్ని చూడగానే అక్కడ ఎలాంటి నిర్మాణం చేపట్టవచ్చో ఊహించగలిగే ఆర్కిటెక్టులు, రంగుల కలయికతో ప్రాణం పోసే చిత్రకారులు, శిల్పులు ఈ కోవకే చెందుతారు. వీరికి దిశల పట్ల అవగాహన, బొమ్మలూ మ్యాప్‌ల ద్వారా విషయాన్ని గ్రహించే శక్తి మెండుగా ఉంటుంది. బాడీలీ- కినెస్థెటిక్ ఇంటెలిజెన్స్: శరీర కదలికల ద్వారా అద్భుతమైన భావప్రకటన చేయగలిగిన శక్తి వీరి సొంతం. అథ్లెట్లుగా మైదానంలో ప్రతిభ చూపుతారు. నృత్యకారులుగా వేదిక మీద రాణిస్తారు. సునిశితమైన కళాకారులుగా విభిన్న కళల్లో వీరి ప్రతిభ చూడవచ్చు. మ్యూజికల్ ఇంటెలిజెన్స్: శృతి, లయ, స్వర జ్ఞానంతో పాటు గొంతులను తేలిగ్గా గుర్తుపట్టగల సామర్థ్యం మ్యూజికల్ ఇంటెలిజెన్స్ ఉన్నవాళ్లకు ఎక్కువగా ఉంటుంది. వీళ్లు ప్రతి చిన్న శబ్దాన్నీ వినగలరు, దాని ప్రత్యేకతలను గుర్తించగలరు. సంగీతం, ధ్వనికి సంబంధించిన రంగాల్లో మంచి గుర్తింపు పొందుతారు. ఇంటర్ పర్సనల్ ఇంటెలిజెన్స్: అనుబంధాలూ మానవ సంబంధాల నిర్వహణలో వీరి తర్వాతే ఎవరైనా. అందరినీ కలుపుకొని పోగలరు. ఇతరుల భావాలను, అవసరాలను అర్థం చేసుకోవడంలో సిద్ధహస్తులైన వీరు సైకాలజిస్టులుగా, మేనేజర్లుగా, ఉపాధ్యాయులుగా, రాజకీయ నాయకులుగా మంచి ప్రభావం చూపగలరు. ఇంట్రాపర్సనల్ ఇంటెలిజెన్స్: క్రమశిక్షణ వీరి సొంతం. తమ బలాలూ బలహీనతలను తెలుసుకోవడం, తదనుగుణంగా




లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకెళ్లడం వీరి లక్షణం. సైకాలజీ, రచన, వ్యాపారం, ఫిలాసఫీ, రీసెర్చ్.. ఇలాంటి భిన్న రంగాల్లో రాణించగలరు. నేచురలిస్టిక్ ఇంటెలిజెన్స్: వీళ్లకు ప్రకృతిని అద్భుతంగా అర్థం చేసుకోగల శక్తి ఉంటుంది. రైతులుగా, ప్రకృతి ప్రియులుగా, పర్యావరణవేత్తలుగా కనిపిస్తారు.

# హర్మ్యూజ్ దాటిన రెండు భారత ఎల్ పీజీ నౌకలు మరో ఆరు రెడీగా ఉన్నాయన్న కేంద్రం

మొదటి పేజి తరువాయి

హర్మ్యూజ్ జలసంధిని దాటేటప్పుడు టోల్ లేదా సుంకం విధించే అంశంపైనా నౌకా రవాణా మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ సిన్హా స్పందించారు. "ఇది ఒక అంతర్జాతీయ జలసంధి, అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం దీనికి స్వేచ్ఛా నౌకాయాన హక్కు ఉంది. అంతర్జాతీయ నిబంధనల ప్రకారం దీనిపై ఎటువంటి సుంకం విధించరాదు. అందువల్ల ఎవరైనా చెప్పే ఏ వాస్తవానికైనా, చేసే ఏ వాదనకైనా ఎటువంటి ఆధారం లేదు. ఇది ఒక నిరాధారమైన వాదన. ఐదు ఎల్పీజీ ట్యాంకర్లు సరకుతో నిండి ఉన్నాయి. ఒక ఎల్పీజీ ట్యాంకర్ ఖాళీగా ఉంది. కానీ ఇప్పుడు అది డ్రై డాక్ నుంచి బయటకు వచ్చింది. రాబోయే మూడు నాలుగు రోజుల్లో దానిని కూడా సరుకుతో నింపుతారు. కాబట్టి మొత్తం మీద మనకు ఆరు ఎల్పీజీతో నిండిన క్యారియర్లు ఉంటాయి." అని తెలిపారు. "హర్మ్యూజ్ జలసంధిని దాటడానికి ఎలాంటి అనుమతి అవసరం లేదు. ఇది ఒక అంతర్జాతీయ జలసంధి. గతంలోనూ అనుమతి అవసరం ఉండేది కాదు. నేటికీ ఎవరీ అనుమతి అవసరం లేదు. భద్రతా పరిస్థితులు ఎలా ఉంటాయి, ఎలా ముందుకు సాగాలి, ఏ సమయంలో ప్రయాణించాలి అనే విషయాలను అంచనా వేయడం తప్పా మరెవరి నుంచీ అనుమతి తీసుకోవాల్సిన అవసరం మాత్రం ఏమాత్రం లేదు"



రాజేష్ సిన్హా, నౌకా రవాణా మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి

మరో ఆరు ఎల్‌పీజీ నౌకలు సిద్ధంగా ఉన్నాయి : కేంద్రం

మరోవైపు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరడంతో ఎల్పీజీ కొరత రాకుండా చూసుకునేందుకు భారత్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. పర్షియన్ గల్ఫ్‌లో నిలిచి ఉన్న మరికొన్ని ట్యాంకర్లను హర్మ్యూజ్ జలసంధి దాటించేందుకు ఇరాన్ అధికారులతో కేంద్రం చర్చిస్తోంది. ఈ చర్చలు సఫలం అయితే ఆరు ట్యాంకర్లు భారత్‌కు చేరుకుంటాయి. ఫలితంగా 3,00,000 టన్నుల ఎల్పీజీ అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. భారత్ నౌకలకు దీర్ఘకాలిక గ్యారెంటీ లేకపోవడంతో ఎప్పటికప్పుడు ఇరాన్‌తో చర్చలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే అంతర్గత పరిస్థితుల దృష్ట్యా నౌకల అనుమతుల విషయంలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) నిర్ణయం తీసుకోవడం ఆలస్యం అవుతోంది. కాగా, తమ అధికారులతో సమన్వయం చేసుకొంటూ తటస్థ దేశాల నౌకలు హర్మ్యూజ్ మీదుగా వెళ్లొచ్చని ఇరానియన్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రకటించింది. ఇరాన్ అధికారులు సహకార వైఖరిని అవలంబిస్తున్నారని భారత ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో హర్మ్యూజ్ నుంచి నౌకల రాకపోకల విషయంలో కాస్త సానుకూలత కనిపిస్తోంది.

# సంపాదకీయం

## ప్రపంచం తల్లడిల్లుతున్నా నిబ్బరంగా భారత్!

ప్రపంచమంతా అలజడితో అట్టుడుకుతున్నప్పుడు, ఒక దేశం ప్రశాంతంగా ఉందంటే... ఆ దేశ పగ్గాలు ఒక స్థితప్రజ్ఞుడి చేతిలో ఉన్నాయని అర్థం. ప్రస్తుతం నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ఇలాంటి నాయకత్వాన్ని చూస్తోంది. అగ్రరాజ్యం అమెరికాఇజ్రాయెల్ కూటమికీ, ఇరాన్‌కూ మధ్య రేగిన యుద్ధజ్వాలలు కేవలం ఆ దేశాలకే పరిమితం కాలేదు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వెన్నెముకను దెబ్బతీస్తున్నాయి. ప్రపంచానికి అవసరమైన ఇంధనంలో సింహభాగాన్ని సరఫరా చేసే గల్ఫ్ దేశాలు నేడు యుద్ధ క్షేత్రాలుగా మారడంతో చమురు సరఫరా వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. ఈ సంక్షోభం వల్ల అగ్రరాజ్యం అమెరికా నుంచి మన పొరుగున ఉన్న శ్రీలంక వరకు అన్నీ అతలాకుతలం అవుతున్నాయి. కానీ, ఇంతటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా 140 కోట్ల జనాభా ఉన్న భారత్ మాత్రం ఎంతో నిబ్బరంగా, సురక్షితంగా ఉంది. దానికి కారణం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ ముందుచూపు, ధైర్యవంతమైన నిర్ణయాలే. యుద్ధం కారణంగా నేడు అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. స్వయంగా అమెరికాలోనే పెట్రోల్, డీజిల్ ధరలు 25 శాతానికి పైగా పెరిగాయి. యూరప్ దేశాల పరిస్థితి వర్ణనాతీతం. రష్యాఉక్రెయిన్ యుద్ధం తర్వాత ఇప్పుడీ గల్ఫ్ సంక్షోభం యూరప్‌ను ఆర్థిక మాంద్యంలోకి నెట్టేసింది. అక్కడ పరిశ్రమలు మూతపడుతున్నాయి, గృహ వినియోగానికి గ్యాస్ దొరకని పరిస్థితి నెలకొంది. మన పొరుగు దేశాల పరిస్థితి ఇంకా ఘోరంగా ఉంది. పాకిస్థాన్ ఇప్పటికే దివాలా అంచున నిలబడింది. విదేశీ మారకద్రవ్యం లేక చమురు నౌకలను రేవుల్లోకి రప్పించుకోలేని దైన్యం ఆ దేశానిది. ఇక శ్రీలంక, నేపాల్ తదితర దేశాల్లో ప్రజలు రోడ్ల మీదకు వచ్చి అల్లర్లు చేసే స్థితికి చేరుకున్నారు. ఇంతటి భయానక వాతావరణంలో భారత్‌లో మాత్రం పెట్రోల్ బంకుల వద్ద క్యూలు లేవు, గ్యాస్ సిలిండర్ల కోసం కొట్లాటలు లేవు. యుద్ధం మొదలైన తొలి రోజుల్లో సహజంగానే ప్రజల్లో కొంత ఆందోళన నెలకొన్నప్పటికీ, ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించింది. దేశంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సరిపడా ఉన్నాయనీ, ఎవరూ ఆందోళన చెందవద్దనీ భరోసా కల్పించడంలో మోదీ ప్రభుత్వం విజయవంతమైంది. అంతర్జాతీయంగా ఎల్పీజీ ధరలు టన్నుకు 800 డాలర్ల మార్కును దాటినప్పటికీ, భారత ప్రభుత్వం దేశీయ వినియోగదారులపై ఆ భారం పడకుండా ఉక్కు కవచంలా నిలిచింది. దేశంలో సుమారు 32కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, అందులో 90శాతానికి పైగా ఉన్న గృహ వినియోగదారులకు నిరంతర సరఫరా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కమర్షియల్ వినియోగంపై వ్యూహాత్మక ఆంక్షలు విధించింది. వాణిజ్య అవసరాల కంటే సామాన్యుడి వంటగదికే మొట్టమొదటి ప్రాధాన్యమిస్తూ, గృహ అవసరాలకు సరిపడా నిల్వలను కేటాయించిన తర్వాతే మిగిలిన మొత్తాన్ని ఇతర రంగాలకు మళ్లిస్తోంది. ప్రపంచ ముడి చమురు రవాణాలో 20 నుంచి 30శాతం వాటా కలిగి, రోజుకు సుమారు 2.1 కోట్ల బ్యారెళ్ల చమురు ప్రవహించే హోర్ముజ్ జలసంధి మార్గంలో అనేక దేశాల నౌకలు దాడుల భయంతో నిలిచిపోయాయి. అయినప్పటికీ, అక్కడి నుంచి భారత ఎల్పీజీ, చమురు నౌకలు సురక్షితంగా మన తీరానికి చేరుకుంటున్నాయంటే అది ప్రధాని మోదీ సాధించిన అద్భుత దౌత్య విజయం. అటు ఇజ్రాయెల్, అమెరికా నేతలతోనూ, ఇటు ఇరాన్, అరబ్ దేశాల అధినేతలతోనూ ఆయనకు ఉన్న వ్యక్తిగత పరపతి కారణంగా భారత నౌకలకు 'సేఫ్ పాసేజ్' లభిస్తోంది. ఇది కేవలం రవాణా విజయం మాత్రమే కాదు, అంతర్జాతీయ వేదికపై భారత్ సంపాదించుకున్న గౌరవానికి నిదర్శనం. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల దిశగా దూసుకుపోతున్న తరుణంలో, భారత్ తన ఇంధన భద్రతను కాపాడుకోవడానికి అత్యంత తెలివైన వ్యూహాన్ని అమలు చేస్తోంది. గల్ఫ్ దేశాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూనే, రష్యా నుంచి తక్కువ ధరకు చమురును దిగుమతి చేసుకుంటోంది. ఇది దేశీయ మార్కెట్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరగకుండా అదుపులో ఉంచడానికి సహకరించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల పెరుగుదల వల్ల ప్రభుత్వ రంగ చమురు సంస్థలపై పడే ఆర్థిక భారాన్ని ప్రజలపైకి నెట్టకుండా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోంది. ధరల స్థిరీకరణ నిధి ద్వారా మార్కెట్ హెచ్చుతగ్గుల నుంచి సామాన్యుడికి రక్షణ కల్పిస్తోంది. సంక్షోభ సమయంలో రాజకీయ లబ్ధి కోసం ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టే సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా, కష్టకాలంలో దేశానికి వెన్నుదన్నుగా నిలబడి, ఒక పటిష్ఠమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించడంలో మోదీ నాయకత్వం సఫలీకృతమైంది. ప్రస్తుతం దేశంలో ఇంధన నిల్వలు నిండుగా ఉన్నాయని, సామాన్యుడికి గ్యాస్ సరఫరాలో లోటు లేదని ప్రభుత్వం గణాంకాలతో సహా భరోసా ఇస్తున్నప్పటికీ, ప్రతిపక్షాలు మాత్రం లేని గందరగోళాన్ని సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నాయి. వాస్తవాలను వక్రీకరిస్తూ, గ్యాస్ సిలిండర్లతో వీధుల్లోకి వచ్చి నిరసనలు చేయడం వెనుక ఉద్దేశం ధరల తగ్గింపు కాదు, కేవలం ప్రజల్లో ఆందోళనను నింపడమే. పొరుగు దేశాలైన పాకిస్థాన్, శ్రీలంకల్లో ప్రజలు పడుతున్న నరకయాతనను చూసి కూడా బుద్ధి తెచ్చుకోకుండా, భారత్ ఎదుగుదలను అడ్డుకోవాలని చూడటం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. సంక్షోభ సమయంలో వ్యవస్థలను కుప్పకూల్చాలని చూసే ఇటువంటి శక్తులను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు; దేశం గెలిస్తేనే తాము గెలుస్తామన్న కనీస స్పృహ లేని ఈ పార్టీలకు కాలమే సమాధానం చెబుతుంది. ఈ పరిస్థితుల్లో విభేదాలను పక్కన పెట్టి, 'భారతదేశం' అనే ఒకే గుర్తింపుతో ముందుకు సాగడమే తక్షణ కర్తవ్యం. రాబోయే పరిణామాలను ఎదుర్కొనేలా ప్రజల్ని మానసికగా, సామాజికంగా సంసిద్ధం

# సయోధ్యకు ఏదీ మార్గం?



ఇరాన్ శక్తిమంతమైన అమెరికా, ఇజ్రాయెల్‌లపై పోరాడుతోంది. ఒక జాతిగా మనుగడ సాగించాలని గట్టి ప్రయత్నాలే చేస్తోంది. కానీ, టెహ్రాన్‌కు కీలకమైన చమురు వనరులు ప్రమాదంలో పడ్డాయి. పొరుగు నుంచి మద్దతూ పెద్దగా లభించట్లేదు. దాంతో ఇరాన్‌కిది చావోబతుకో తేల్చుకునే చివరి యుద్ధమని, ఇది పశ్చిమాసియాలో ఆట స్వరూపాన్నే మార్చేస్తుందనే విశ్లేషణలు వెలువడ్డాయి. ఇలాంటి తరుణంలో– తాము ఇరాన్‌తో సాగిస్తున్న చర్చలు ఫలప్రదమవుతున్నందున, ఆ దేశ ఇంధన వసతులపై దాడులకు అయిదు రోజులపాటు విరామం ఇస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించారు. కానీ, ఆయన వ్యాఖ్యలను ఇరాన్ ఖండించింది. అసలు అమెరికాతో తాము చర్చలే జరపలేదంటూ కొట్టిపారేసింది. దీంతో యుద్ధం ఆగుతుందా, కొనసాగుతుందా అన్న సందిగ్ధత నెలకొంది. అమెరికా, ఇజ్రాయెల్ నడిపిస్తున్న యుద్ధానికి తనకు అనుకూలంగా ముగింపు పలకాలని ఇరాన్ భావిస్తోంది. ఆ దేశం విచ్ఛిన్నమయ్యే ముప్పును తగ్గించిన యుద్ధం అక్కడి ప్రజలను ఒక్కతాటిపై నిలిపింది. ట్రంప్ ప్రతిపాదనలను మొదట్లో తిరస్కరించిన ఇరాన్– తనకు మెరుగైన ప్రయోజనాలు దక్కేదాకా పోరు కొనసాగించడానికే మొగ్గుచూపింది. అదీకాక ఇరాన్ కొత్త నాయకుల ఏలుబడిలో అణ్వాయుధాలపై పునరాలోచన జరిగే అవకాశముంది. అణ్వాయుధ దేశంగా ప్రకటించుకోకుండానే, అణు సాంకేతికతను అభివృద్ధి చేయడానికి భారత్ వంటి దేశాల నమూనాలను అనుసరించవచ్చు. ఇరాన్ రాచరికంవైపు మళ్లడమా, మతపెద్దల పాలనలోనే కొనసాగడమా అనేదీ ఈ యుద్ధంతో తేలిపోతుంది. చమురు ఎగుమతికి కీలకమైన ఖార్గ్ ద్వీపం దెబ్బతిన్న తరవాత స్వదేశీ సరఫరాను సాధారణ పరిస్థితులకు తీసుకురావడం ఇరాన్‌కు వ్యూహాత్మకంగా చాలా అవసరం.

### గల్ఫ్‌పై అపార ప్రభావం

యుద్ధం కారణంగా ప్రభావితమవుతున్న గల్ఫ్‌లోని చిన్న దేశాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. యుద్ధంలో వాటి ప్రమేయం తక్కువే అయినప్పటికీ, ఆ దేశాల ఆర్థిక వ్యవస్థలు, పరిశ్రమలపై అపార ప్రభావం ఉంటోంది. చమురు ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలోపెట్టడం, ఇంధన రవాణాకు ప్రత్యామ్నాయ మార్గాలను రూపొందించడంతోపాటు పెట్టుబడులూ పర్యాటకానికి ఆ దేశాలు మళ్లీ ఆకర్షణ కేంద్రాలుగా మారడానికి చాలాకాలమే పడుతుంది. ఇదంతా అమెరికా అందించే సైనిక మద్దతుపై భ్రమలు తొలగిస్తుందా, గల్ఫ్‌లో సమగ్ర భద్రతా వ్యవస్థ ఏర్పాటు వైపు దారితీస్తుందా అనేది చూడాలి. మరోవైపు, పశ్చిమాసియాలో కీలక దేశమైన సౌదీఅరేబియా తన చమురు పైప్‌లైన్ల సామర్థ్యాలను పెంచుకోవడం ద్వారా హర్మూజ్‌ను తప్పించుకోవడానికి ప్రణాళికలు రూపొందించుకోవాల్సి ఉంటుంది. రష్యా, చైనాలు అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేస్తున్న ప్రత్యర్థులు. అమెరికా బలహీనపడాలనే అవి కోరుకుంటాయి. యుద్ధం వల్ల రష్యాకు తన చమురు విక్రయ అవకాశాలు పెరిగాయి. అలా సమకూరే భారీ సంపదతో మాస్కో ఇరాన్‌కు అవసరమైన సైనిక, నిఘాపరమైన సాయం చేయవచ్చు. చైనా కూడా ఇరాన్‌కు నిశ్శబ్దంగా మద్దతు కొనసాగించవచ్చు. ఇరాన్‌కు ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురుకాకుండా, భద్రతామండలిలో ఆ దేశానికి అనుకూలంగా ఓటింగ్ జరిగేలా ఉభయ దేశాలు పావులు కదపవచ్చు. ఇండియా విషయానికి వస్తే, పశ్చిమాసియా చమురుపై అధికంగా ఆధారపడుతున్న కారణంగా గల్ఫ్ దేశాలతోపాటు ఇజ్రాయెల్‌తో వాణిజ్యాన్ని సమతుల్యం చేసుకోవాల్సిన అవసరముంది. కాబట్టి, భారత్ అప్రమత్తంగా వ్యవహరించాలి. అస్థిరత కారణంగా ఆర్థిక వ్యవస్థ స్తంభించకుండా చూసేందుకు పశ్చిమాసియాలో సంపూర్ణ యుద్ధ విరమణకూ కృషిచేయాలి.

### మధ్యవర్తిత్వానికి ముందుకొచ్చేది ఎవరు?

అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య యుద్ధం డిగోగార్షియా దీవుల వరకూ వ్యాపించింది. ఇరాన్‌లో, ఇతర గల్ఫ్ దేశాల్లో ఇప్పటికే లక్షలమంది నిరాశ్రయులయ్యారు. పశ్చిమాసియాలోని అమెరికా ఆస్తులు ఇరాన్‌కు లక్ష్యంగా మారడం వల్ల గల్ఫ్ దేశాలకూ నష్టం తప్పలేదు. మరోవైపు హర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతల కారణంగా చమురు రవాణాకు ఆటంకాలు ఏర్పడి, ప్రపంచ వ్యాప్తంగా వాటి ధరలు మండిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో 'హర్మూజ్ ఒత్తిడి' అగ్రరాజ్యంపై పనిచేసినట్లే కనిపిస్తోంది. టెహ్రాన్‌తో చర్చలు సానుకూలమవుతున్నందున, అయిదు రోజులపాటు దాడులను ఆపేస్తున్నట్లు ట్రంప్ తాజాగా ప్రకటించారు. ఇరాన్ మాత్రం ఆయన వ్యాఖ్యలు ఉత్తదేనంటూ కొట్టిపారేసింది. ఇలాంటి పరిస్థితుల్లో పూర్తిస్థాయి యుద్ధ విరమణకు ఎవరు, ఎప్పుడు మధ్యవర్తిత్వం వహిస్తారనే సందిగ్ధత నెలకొంది. ఇరాన్ అణ్వాయుధాలు, క్షిపణులు, ఉగ్రవాదులకు మద్దతు ఇవ్వడంపై ఇజ్రాయెల్‌లో అనుమానాలు ఇంకా తొలగిపోలేదు. దశాబ్దాలుగా తమ వాణిజ్యంపై ఆంక్షలు కొనసాగుతుండటం, తమ సరిహద్దుల్లో నిరంతరం జరుగుతున్న యుద్ధాలు, బాంబుదాడులపై ఇరాన్ ఆగ్రహంతో ఉంది. ఐరోపా ప్రత్యక్ష ప్రమేయానికి ఆసక్తి చూపడం లేదు. ఐరాస నిష్క్రియగా మారడంతో దానిపైనా నమ్మకం సన్నగిల్లింది. ఇలాంటి పరిస్థితుల్లో సయోధ్యకు ఇరాన్ అంగీకరిస్తుందా, దీర్ఘకాలిక యుద్ధానికే మొగ్గుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రజాగ్రహంతో సతమతమవుతున్న అమెరికాకు యుద్ధాన్ని కొనసాగించే ఓపిక లేదు. ఆర్థిక పరిస్థితులు అగ్రరాజ్య ఆలోచనల్లో మార్పు తెచ్చే అవకాశం లేకపోలేదు. తీర్చలేని అప్పుల భారంతో అలసిపోయి అమెరికా కొంత వెనక్కి తగ్గవచ్చు. రాబోయే కాలంలో డాలర్ ఆధిపత్యంలో తగ్గుదలకూ సిద్ధపడవచ్చు. ఆ క్రమంలో నిజమైన శాంతిస్థాపన దిశగా అడుగులు పడవచ్చు. ప్రపంచ దేశాల ఒత్తిడి మేరకు చమురు, గ్యాస్ ఎప్పటిలా నిరంతరాయంగా సరఫరా అయ్యేలా సాధారణ పరిస్థితులను పునరుద్ధరించడం, అణ్వాయుధాలు వంటి అంశాలు చర్చల్లో ప్రధాన అజెండాగా మారవచ్చు. అయితే, చమురు ధరలు హేతుబద్ధమైన స్థితికి చేరుకోవడానికి కొంత సమయం పడుతుంది. కాబట్టి, సమీప భవిష్యత్తులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం తప్పదు. నష్ట నివారణ కోసం యుద్ధంలో ప్రత్యక్షంగా పాలుపంచుకుంటున్న దేశాలతోపాటు, ప్రస్తుత పరిస్థితులతో ప్రభావితమవుతున్నవి కూడా శాంతిస్థాపన దిశగా అడుగులు వెయ్యాలి. లేకపోతే వినాశనం తప్పదు. ఆ మేరకు ఆయా దేశాల నేతల వివేకమే ఇలాంటి పరిస్థితుల్లో ఆశాకిరణంలా పనిచేస్తుంది.

# చమురుకు రెక్కలు... రూపాయికి చిక్కులు!



ఇటీవలి కాలంలో భారతీయ రూపాయి విలువ బాగా తగ్గుతూ చరిత్రాత్మక కనిష్ఠ స్థాయులకు చేరుకుంది. నిన్నటికి రూపాయి విలువ డాలర్‌కు రూ.93.94 వరకు పడిపోయింది. గతేడాది చివర నుంచి గణనీయమైన క్షీణత నమోదైంది. అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతలు, ప్రపంచ వాణిజ్య విధానాలు, మూలధన ప్రవాహాలు, దేశీయ ఆర్థిక బలహీనతలు వంటి కారణాలన్నీ కలసి రూపాయి పతనానికి కారణమవుతున్నాయి. గల్ఫ్‌లో యుద్ధ పరిస్థితులు రూపాయి విలువపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. యుద్ధం కారణంగా అంతర్జాతీయ ముడి చమురు ధరలు గణనీయంగా పెరిగాయి. యుద్ధం ప్రారంభమైన తరవాత చమురు ధరలు దాదాపు 40శాతం పెరిగినట్లు అంచనా. భారత్ తన చమురు అవసరాల్లో 80 శాతం కంటే ఎక్కువ దిగుమతులపైనే ఆధారపడుతుంది. అందువల్ల చమురు ధరలు పెరిగినప్పుడు దిగుమతి వ్యయం అధికమవుతుంది. దీనివల్ల డాలర్లకు డిమాండ్ పెరిగి రూపాయి విలువ తగ్గుతుంది. చమురు ధరల పెరుగుదల దేశీయ ద్రవ్యోల్బణాన్ని కూడా పెంచుతుంది. రవాణా, ఉత్పత్తి ఖర్చులు ఎక్కువ కావడమే ఇందుకు కారణం. విదేశీ మూలధన ప్రవాహాల తగ్గుదల కూడా రూపాయి బలహీనపడటానికి మరో ముఖ్యకారణమే. అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి పెరిగినప్పుడు పెట్టుబడిదారులు సురక్షితంగా భావించే మార్కెట్లలో పెట్టుబడులు పెడతారు. దీనివల్ల భారతదేశం నుంచి విదేశీ పెట్టుబడులు బయటికి వెళ్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో డాలర్ బలపడి, రూపాయి బలహీనమవుతుంది. కొన్ని అంచనాల ప్రకారం యుద్ధం మొదలయ్యాక మొత్తంగా సుమారు ఎనిమిది వందల కోట్ల డాలర్లదాకా పెట్టుబడులు బయటికివెళ్లాయి. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న రక్షణాత్మక వాణిజ్య విధానాలు కూడా రూపాయి విలువపై ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా అమెరికా విధించిన టారిఫ్‌లు అంతర్జాతీయ వాణిజ్యాన్ని ప్రభావితం చేశాయి. రూపాయి విలువ తగ్గడం వల్ల భారతీయ ఎగుమతులు కొంతవరకు లాభపడతాయి. కానీ ఈ ప్రయోజనం పూర్తిగా లభించదు. ఎందుకంటే, ఎగుమతులకు అవసరమైన ముడి పదార్థాల దిగుమతుల ఖర్చు పెరుగుతుంది కాబట్టి!

### నిర్మాణాత్మక సమస్యలు

ఇండియాకు సంబంధించిన నిర్మాణాత్మక సమస్యలు కూడా రూపాయి బలహీనతకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా వాణిజ్యలోటు ఉండటం, చమురు మీద అధికంగా ఆధారపడటం, సేవల రంగంలో మందగమనం వంటి అంశాలు రూపాయి స్థిరత్వాన్ని దెబ్బతీస్తున్నాయి. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం 2025–26 మూడో త్రైమాసికంలో కరెంట్ అకౌంట్ లోటు జీడీపీలో 1.3శాతంగా ఉంది. చమురు ధరలు పెరిగితే ఈ లోటు మరింత పెరుగుతుంది. ఇలాంటి సమస్యలు ఉన్న సమయంలో బయటి నుంచి శరాఘాతాలు ఎదురైనప్పుడు రూపాయి విలువ వేగంగా పడిపోతుంది. ఈ పరిస్థితుల్లో ఆర్‌బీఐ రూపాయి విలువను స్థిరపరచడానికి పలు చర్యలు తీసుకుంటోంది. ప్రధానంగా ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్లను అమ్మడం ద్వారా రూపాయికి మద్దతు ఇస్తోంది. అదనంగా, ఫార్వర్డ్, నాన్–డెలివరబుల్ మార్కెట్లలో కూడా జోక్యం చేసుకుంటోంది. విదేశీ మారక నిల్వలను ఉపయోగించి మార్కెట్‌లో స్థిరత్వాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. ద్రవ్య విధానపరంగా సమతుల్యతను పాటిస్తోంది. ఈ సమయంలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంతో పాటు ఆర్థిక వృద్ధి దెబ్బతినకుండా చూసుకోవడం కూడా ముఖ్యం. రూపాయి విలువ పడిపోవడం దేశీయ ఆర్థిక వ్యవస్థపై పలు దుష్ప్రభావాలు చూపుతుంది. మొదటగా, దిగుమతుల ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం కట్టుతప్పుతుంది. ఇంధన ధరలు అధికమైతే అన్ని రంగాల్లో ఖర్చులు పెరుగుతాయి. ఇది వినియోగాన్ని తగ్గించి ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేస్తుంది. ఎగుమతుల విషయంలో రూపాయి బలహీనత కొంత ప్రయోజనకరంగా ఉంటుంది. భారతీయ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లలో చవకగా మారుతాయి. అయితే గ్లోబల్ డిమాండ్ తగ్గడం, అధిక ఇన్‌పుట్ ఖర్చులు ఈ ప్రయోజనాన్ని పరిమితం చేస్తాయి.

### భవిష్యత్తులో పరిస్థితి ఏంటి?

రాబోయే రోజుల్లో రూపాయి పరిస్థితి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా చమురు ధరలు స్థిరపడి, అంతర్జాతీయ పరిస్థితులు మెరుగుపడితే రూపాయి విలువ పతనం ఆగవచ్చు. విదేశీ పెట్టుబడులు తిరిగి పెరిగినా రూపాయి బలపడుతుంది. దీర్ఘకాలంలో భారత్ నిర్మాణాత్మక సంస్కరణలపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలి. ఎగుమతులను వైవిధ్యీకరించాలి. దేశీయ ఉత్పత్తిని పెంచడమూ అవసరమే. వీటితోపాటు, రూపాయి ఆధారిత అంతర్జాతీయ వాణిజ్యాన్ని ప్రోత్సహించడం ప్రధానం. మొత్తమ్మీద రూపాయి విలువ పడిపోవడం తాత్కాలిక గండం మాత్రమే కాదు, అది దేశ ఆర్థిక నిర్మాణానికి సంబంధించిన లోతైన సమస్యలను ప్రతిబింబిస్తుంది. సరైన విధాన చర్యలు తీసుకోవడం, సంస్కరణలు చేపట్టడం ద్వారా ఈ విపత్కర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవచ్చు.

### ఈ-వ్యర్థాల శుద్ధిలో ఎవరెక్కడ?

దేశంలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఉపకరణాల వినియోగం పెరుగుతోంది. దాంతో ఈ–వ్యర్థాలు పెద్దయెత్తున పుట్టుకొస్తున్నాయి. వీటిలో లెడ్, మెర్క్యురీ, కాడ్మియం వంటి ప్రమాదకర రసాయనాలు ఉంటాయి. కాబట్టి వాటిని శాస్త్రీయంగా పునఃశుద్ధి చేయాలి. అందుకోసం కేంద్రం 106 రకాల ఈ–వ్యర్థాల పునఃశ్శుద్ధికి మార్గదర్శకాలు తెచ్చింది. 2025–26లో దేశవ్యాప్తంగా 14.14 లక్షల టన్నుల ఈ–వ్యర్థాలు పోగుపడ్డాయి. అందులో 9.79 లక్షల టన్నులు పునఃశ్శుద్ధి అయ్యాయి.

# సాగుకు పట్టిన చీడ కాంగ్రెస్



'ఎదుటి మనిషికి చెప్పేటందుకే నీతులు ఉన్నాయి' అని అని పెద్దలు ఎప్పుడో అన్నారు. ఒడ్డున కూర్చుండి ఎన్నయినా మాట్లాడవచ్చును. పగ్గాలు చేతపుచ్చుకొని బండి నడిపించినప్పుడే ఆ మాటల పస ఏంటో తేలిపోతుంది. తెలంగాణ తొలి సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే కేసీఆర్ సాగు మీద ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్ర సాధనకు అనితర సాధ్యమైన ఉద్యమాన్ని నిర్మించిన కేసీఆర్.. సమైక్య పాలకులు దండగన్న వ్యవసాయాన్ని పండుగలా మార్చేందుకు మరో మహోద్యమాన్ని చేపట్టారు. వ్యవసాయ స్థిరీకరణకు నడుం బిగించారు. అద్వితీయమైన చాకచక్యంతో కరెంట్ కష్టాలు తీర్చారు. 'నీరు పల్లమెరుగు' అనే నానుడిని మార్చి గోదారి గంగను కొండలెక్కించారు.రాష్ట్ర వార్తలు బీటలు వారిన తెలంగాణను పచ్చలహారంలా మలిచారు. మరో కోనసీమగా నిలిపారు. వరి దిగుబడిలో రికార్డులు బద్దలు కొట్టి, తెలంగాణను దేశానికి అన్నపూర్ణగా ఆవిష్కరించారు. కేంద్రం మెడలు వంచి ధాన్యం కొనుగోళ్లు జరిపించారు. ఇదంతా నిరాటంకంగా జరుగుతున్న సమయంలో అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు, ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం చేశారు? ప్రభుత్వానికి వంకలు పెట్టారు. 'అంతన్నాడింతన్నాడే' అన్నట్టు గప్పాలు కొట్టారు. ప్రజల పొరపాటునో, గ్రహపాటునో ఇప్పుడు సీఎం. నాడు చెప్పిందేంటి? నేడు చేస్తున్నదేమిటి? అని ప్రజలు గమనిస్తున్నారు.ఖజ= విజన్ సాధకులు మాటలతో కాలక్షేపం చేయరు. ఇతరుల మీద రాళ్లు వేస్తూ స్వోత్కర్ష చేసుకోరు. కానీ పెనం మీద పేలపు గింజలా ఎగిరే రేవంత్‌రెడ్డికి ఇలాంటి ఉదాత్తమైన విషయాలు వర్తించవు. 'అల్పుడెప్పుడు పల్కు ఆడంబరంగాను' అన్నట్టు నోరు గోక్కునే మాటలు తప్ప తనకు మరేమీ చేతకాదు. ఆడలేక మద్దెల ఓడు అన్నట్టుగా ఇప్పుడు మాట మార్చారు. యూరియా సరఫరా చేయలేక ఏకంగా వరి పంటే వేయొద్దని రైతులకు ఉచిత సలహా ఇస్తున్నారు. అటు బడేభాయ్‌ని ఒప్పించే జామర్దా లేక కొనుగోళ్లు సాధ్యం కావని బీద అరుపులు అరుస్తున్నారా? ఇటీవల కేంద్రమంత్రిని కలిసినప్పుడు 50 వేల మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ వడ్లు కొనబోమని తేల్చిచెప్పారని, కాబట్టి అంతకుమించి కొనే ధాన్యాన్ని ఏం చేయాలో చెప్పాలని రైతులను బేలగా అడుగుతున్నారు ముఖ్యమంత్రి. కానీ ధాన్యం కొనాల్సిందేనని కేంద్రంతో కేసీఆర్ కొట్లాడిన పుడు ఇదే రేవంత్‌రెడ్డి స్థాయిని మర్చిపోయి ఏమన్నారో గుర్తుచేసుకుందాం. 'నరేంద్రమోదీనే వడ్లు కొనేదుంటే నువ్వేమన్నా బ్రోకర్ గాడివా? దళారీ పని చేస్తవా? రాష్ట్ర ప్రభుత్వం దగ్గర డబ్బుల్లేవా? రెండున్నర లక్షల కోట్ల బడ్జెట్ ఉన్నప్పుడు రైతుల దగ్గర కొనాల్సింది నువ్వు. నీకు ఓటేసి నిన్ను ముఖ్యమంత్రిని చేస్తే, నువ్వు కొనకుండా మోడీ కొనాలె, బోడిగాడు కొనాలె అని మోకాలికి, బోడి గుండుకు లింకు పెట్టి మాట్లాడున్నడు ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి' అని రేవంత్‌రెడ్డి అన్నారు. కాబట్టి, ఇప్పుడు కేంద్రం వద్ద కొనుగోలుకు పరిమితి విధించింది అని చెప్తున్న రేవంత్‌రెడ్డిని ప్రజలు ఏ భాషలో నిలదీయాలి. ఆనాడు ఆయన మాట్లాడిన మాటలనే తిరిగి ఆయనకే అప్పగిస్తే ఏం సమాధానం చెప్తారో మరి! అంటే ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎంతటి జిమ్మిక్కులకు పాల్పడిందో అర్థం చేసుకోవచ్చు. డిసెంబర్‌లో ఇవ్వాల్సిన రైతుభరోసా పైసలు ఇంకా ఇవ్వలేదు. కానీ రైతుభరోసా ఇచ్చినందుకు తనకు అభినందనలు తెలుపాలని అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి అడుక్కుంటున్నారు. ఎందుకో..! ఇదేమి ఇచ్ఛంత్రమో! కాంగ్రెస్ పాలకులు రైతులను ఒక్కతీరుగా మోసం చేయలేదు. 'కేసీఆర్ రెండు పంటలకు మాత్రమే రైతుబంధు ఇస్తున్నారు, మూడో పంటకు ఎందుకు ఇవ్వరు?' అంటూ హస్తం పార్టీ నేతలు నిలదీశారు. తాము గెలిస్తే భూమి ఉన్న రైతులకు, భూమిలేని కౌలు రైతులకు, ఉపాధి హామీ కూలీలకు మూడు క్యాటగిరీల్లో రైతుభరోసా ఇస్తామని చెప్పుకొచ్చారు. 'ఇండ్లొ స్తే అండ్ల రాదు, అండ్లొస్తే ఇండ్ల రాదు, మొత్తానికి అందరికీ వస్తుంది' అంటూ అతితెలివి ప్రదర్శించారు. అధికారంలోకి రాగానే చాలా విషయాల్లో దగాకు పాల్పడ్డారు. నమ్మించి గొంతుకోశారు. మూడో పంటకు రైతుబంధు ఎందుకు ఇవ్వరు అన్నటువంటి పెద్దమనిషి, అసలుకే ఎసరు పెడితే రైతులను నమ్మించి గొంతు కోయడం కాదా? ఇప్పుడు ఏకంగా యూరియా కూడా ఇవ్వలేమని అసమర్థతను చాటుకున్నారు. ఆనాడు కేసీఆర్ ఆయిల్‌పామ్ పంటను ప్రోత్సహిస్తే.. అదొక వృథా అని ఘనత వహించిన కాంగ్రెస్ పెద్దలు విజ్ఞాన ప్రదర్శనలు చేశారరు. ఇప్పుడు పంట మార్పిడి చేయాల్సిందేనని చిలుక పలుకులు పలుకుతున్నారు. కాంగ్రెస్‌ను నమ్మినందుకు రైతులకు మన్నే గతి అయింది. 'తియ్యటిమాటలకు తీర్థం పోతే నువ్వు గుల్లె, నేను సల్లె' అన్నట్టు అయిపోయిం ది పరిస్థితి.

## వట్టెంలో డిపెప్ మిత్రుల రజతోత్సవ ఆత్మీయ సమ్మేళనం....



నాగర్ కర్నూల్//మార్చి 24 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లా ప్రాథమిక విద్యా పథకం క్రింద విజయవంతంగా పని చేసి విద్యా లక్ష్యాలను సాధించడంలో విశేష కృషి చేసిన రిసోర్స్ పర్సన్స్ గ్రూప్ 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రజితోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. వట్టెం గుట్టపై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి సమక్షంలో ఉమ్మడి జిల్లాకు చెందిన సుమారు 100 మంది ఈవేడుకల్లో పాల్గొన్నారు.ముఖ్య అతిథిగా అప్పటి అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సందడి ప్రతాపరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న మిత్రులు ఆయాజిల్లాలలో తాము చేసిన కృషిని గుర్తు చేసుకుంటూ విద్యా రంగంలో ముఖ్యంగా పాఠశాల అభివృద్ధిలో గ్రామస్తుల పాత్రపై వారు చేసిన పరిశోధనాత్మక అంశాలను నెమరు వేసుకున్నారు.ఈ కార్యక్రమానికి అప్పటి నాలుగు జిల్లాల శిక్షణ ఇంచార్జిగా వ్యవహరించిన గాడి సురేందర్ అధ్యక్షులుగా వ్యవహరించారు. నాగర్ కర్నూలుకుచెందిన బి. వేణుగోపాల్,అడ్డాకులకు చెందిన శివకుమార్ వనపర్తికి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి,ఉపేందర్ రెడ్డి, కల్వకుర్తికి చెందిన చంద్రశేఖర్, పెద్దమందడికి చెందిన వరప్రసాద్, రమాకాంత్,ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శ్రీరామ భద్ర సీతారాముల కళ్యాణ మహోత్సవాలు 26 నుంచి ప్రారంభం...

ఓదెల//మార్చి 24 (ఆకాంక్ష) : ఓదెల మండలంలోని గుంపుల గ్రామంలో మానేరు నది ఒడ్డున వెలసిన శ్రీరామ భద్ర దేవాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలు ఈ నెల 26వ తేదీ నుంచి భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా ప్రారంభంకానున్నాయి. ఈ మహోత్సవాలు మార్చి 30వ తేదీ వరకు కొనసాగనున్నాయని దేవాలయ నిర్వాహకులు తెలిపారు. గురువారం మార్చి 26న సాయంత్రం 5.30 గంటలకు ప్రత్యేక పూజలతో మహోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం ప్రతిరోజూ వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించనున్నారు.మార్చి 27న శుక్రవారం ఉదయం విశేష పూజలు నిర్వహించడంతో పాటు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు. మార్చి 28న శనివారం రథోత్సవాన్ని గ్రామ ఊరేగింపుగా భక్తుల సందడిలో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 29న ఆదివారం ప్రత్యేక పూజలు, సాయంత్రం భక్తి కార్యక్రమాలు కొనసాగనున్నాయి.మార్చి 30న సోమవారం మహాపూర్ణాహుతి, తిరుమంజనం కార్యక్రమాలతో కళ్యాణ మహోత్సవాలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా స్వామివారి దివ్య ఆశీస్సులు పొందేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని గ్రామ సర్పంచ్, దేవాలయ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు కోరారు. గుంపుల గ్రామంలోని ఈ దేవాలయంలో ప్రతి సంవత్సరం నిర్వహించే శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని, ఈ ఏడాది కూడా అదే స్థాయిలో భక్తజనం పాల్గొనే అవకాశముందని నిర్వాహకులు తెలిపారు.




## తుడుకుర్తి పీహెచ్‌సీపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ...

నాగర్‌కర్నూల్ టౌన్//మార్చి 24 (ఆకాంక్ష) : తుడుకుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు ఆదేశించారు. ఆసుపత్రిలో రిసెప్షన్, ఇన్‌పేషెంట్ వార్డులు, ఫార్మసీ, ల్యాబ్ విభాగాలను పరిశీలించిన కలెక్టర్, అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేసి రోజువారీ రోగుల సంఖ్యపై వివరాలు సేకరించారు. స్థానికంగా సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, గర్భిణీలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెంపొందించేలా సేవలు ఉండాలన్నారు.అనంతరం తుడుకుర్తిలో నిర్మాణంలో ఉన్న నూతన ఆసుపత్రి భవనాన్ని పరిశీలించి, పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఇంజనీర్లకు ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించేందుకు భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

## పసుపులేరు వాగులో 60 టన్నుల ఇసుక సీజ్...

### అక్రమ రవాణాపై పోలీస్‌రెవెన్యూ సంయుక్త బృందం కఠిన చర్యలు...



మెదక్//మార్చి 24 (ఆకాంక్ష) : మెదక్ జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. మంగళవారం ఆర్ఐ లక్ష్మణ్ నేతృత్వంలో పోలీస్,రెవెన్యూ శాఖల సంయుక్త బృందం పసుపులేరు వాగు పరిసర ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించింది. ఈ తనిఖీల్లో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్న మార్గాలను గుర్తించి చర్యలు తీసుకుంది.పసుపులేరు వాగు వద్ద గంగమ్మ, ఎల్లమ్మ గుడుల సమీపంలో ఇసుకను అక్రమంగా తరలించేందుకు వినియోగిస్తున్న దారిని అధికారులు గుర్తించారు. వెంటనే జేసీబీ సహాయంతో ఆ మార్గాన్ని పూర్తిగా మూసివేశారు. దీంతో అక్రమ రవాణాకు తాత్కాలికంగా అడ్డుకట్ట పడింది.ఈ దాడుల్లో సుమారు 60 టన్నుల అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన ఇసుకను మెదక్ సాండ్ బజార్‌కు తరలించారు. ఈ సందర్భంగా అక్రమ ఇసుక రవాణాపై ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని అధికారులు హెచ్చరించారు.ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచి, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంయుక్త బృందం స్పష్టం చేసింది. స్థానికులు కూడా ఇసుక అక్రమ రవాణాపై సమాచారం అందించి అధికారులకు సహకరించాలని కోరారు.

## మెదక్ జిల్లా పంచాయతీ కార్యాలయంలో 2026 క్యాలెండర్ ఆవిష్కరణ..

మెదక్//మార్చి 24 (ఆకాంక్ష) : మెదక్ జిల్లా పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ ఉద్యోగుల సంఘం జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరమ్ 2026 క్యాలెండర్ ను మెదక్ జిల్లా పంచాయతీ అధికారి శ్రీ యాదయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫోరమ్ జిల్లా అధ్యక్షులు జంగం నగేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి కుంచెం సంతోష్, రాష్ట్ర నాయకులు గడ్డ రాజు, సహాయక కార్యదర్శి రాజం ప్రసాద్, ప్రచార కార్యదర్శి భాను కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ మెదక్ జిల్లాలో జరిగింది.



## నన్ను ఎవరు బుజ్జగించలేదు...

### చుట్టం చూపులా ఇలా వచ్చి అలా వెళ్తున్నారు అంతే.. జీవన్ రెడ్డి



జగిత్యాల//మార్చి 24 (ఆకాంక్ష) : తనది పూలబాట కాదు.. ముళ్లబాట అని ఎంఎల్ సి జీవన్ రెడ్డి తెలిపారు. తనకు పిసిసి చీఫ్ పదవి రాకుండా చేసినా బాధపడలేదని అన్నారు. జగిత్యాలలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అధిష్టానం తనను బుజ్జగించలేదని, కాంగ్రెస్ పార్టీ వీడి వెళ్తున్నానని తెలిసి..ఇలా వచ్చి అలా వెళ్లారని జీవన్ రెడ్డి చురకలంటించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని సంతోషపడ్డానని, రేవంత్ రెడ్డి కు పిసిసి చీఫ్, సిఎం భట్టి విక్రమార్కకి సిఎల్ పి లీడర్, డిప్యూటీ సిఎం ఇచ్చారని తెలియజేశారు. మరి తాను మండలి నేతను కాదా తనకెందుకు అన్యాయం చేశారు అని జీవన్ రెడ్డి ప్రశ్నించారు. తన పదేళ్ల ఒంటరి పోరును అధిష్టానం చిన్నచూపు చూసిందని, పార్టీ ఫిరాయింపుల్లో మనకు మాజీ సిఎం కెసిఆర్ ఆదర్శం కాదు కదా? అని.. అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనలు ఏంటి మనం చేస్తున్నదేంటీ అని..కెసి వేణుగోపాల్ వంటి నేత ఇచ్చిన హామీ అమలు కాకపోతే పార్టీ ఎందుకు అని.. ప్రశ్నించారు.

## 100 రోజుల టిబి నిర్ధారణ శిబిరాల ప్రారంభం...

### క్షయ వ్యాధిని 2030 నాటికి అంతం చేయడమే లక్ష్యం...

### డీఎంహెచ్‌వో డాక్టర్ కె. రవికుమార్...



నాగర్ కర్నూల్//మార్చి 24 (ఆకాంక్ష) :క్షయ వ్యాధిని 2030 సంవత్సరం నాటికి పూర్తిగా అంతం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, క్షయ వ్యాధి నిర్మూలన ప్రతి ఒక్కరి సామూహిక బాధ్యతగా భావించి పని చేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్ పేర్కొన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా 100 రోజుల క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షా శిబిరాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ రవికుమార్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ జిల్లాలో గుర్తించిన 86 హైరిస్క్ గ్రామాల్లో మార్చి 24 నుంచి జూలై 2, 2026 వరకు ప్రత్యేక క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాల్లో 14 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరికీ క్షయ వ్యాధి నిర్ధారణ కోసం ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనుమానిత టిబి లక్షణాలు ఉన్నవారికి ఎక్స్‌రేతో పాటు కఫ పరీక్షలు కూడా చేస్తామని వివరించారు.ఈ విధంగా గ్రామ స్థాయిలో విస్తృత పరీక్షలు నిర్వహించడం ద్వారా క్షయ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి, బాధితులకు తక్షణ చికిత్స అందించి, వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని ఆయన స్పష్టం చేశారు. క్షయ వ్యాధి నిర్మూలనలో క్షేత్రస్థాయి సిబ్బంది కీలక పాత్ర పోషించాల్సి ఉందని, హైరిస్క్ గ్రామాల్లో శిబిరాలు నిర్వహించే సమయంలో 14 ఏళ్లు పైబడిన వారందరినీ శిబిరాలకు తరలించేలా కృషి చేయాలని సూచించారు. గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తేనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని ఆయన అన్నారు.శిబిరానికి హాజరైన ప్రజలకు క్షయ వ్యాధి లక్షణాలు, ముందస్తు జాగ్రత్తలు, చికిత్స పద్ధతులు, నివారణ చర్యలపై డీఎంహెచ్‌వో సమగ్ర అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని, సమయానికి గుర్తించి, పూర్తి కోర్సు మందులు వాడితే వ్యాధి నుంచి బయటపడవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ భీమా నాయక్, వెల్దండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సింధు, స్పెషలిస్టు వైద్య నిపుణులు, డీపీఎంఓ ఆజాద్, హెల్త్ ఎడ్యుకేటర్ రాధ, హెల్త్ సూపర్వైజర్ మురళి, మనోజ్ కుమార్, ప్రమోద్, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్ గోవర్ధన్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.నాగర్‌కర్నూల్ జిల్లాలో టిబి నిర్మూలన దిశగా ఆరోగ్యశాఖ చేపట్టిన ఈ ప్రత్యేక కార్యాచరణకు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని వైద్యాధికారులు పేర్కొన్నారు. గ్రామీణ స్థాయిలో అవగాహన పెంపు, ముందస్తు నిర్ధారణ, నిరంతర చికిత్స ద్వారా క్షయ వ్యాధి రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## నిరంతర యజ్ఞంలా సీఎం కప్...

### క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తాం..

### తెలంగాణ మట్టిలో మాణిక్యాలను గుర్తిస్తాం...

### సీఎం కప్ రాష్ట్ర స్థాయి ముగింపు వేడుకల్లో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి...

హైదరాబాద్//మార్చి 24 (ఆకాంక్ష) :తెలంగాణ మట్టి లోని మాణిక్యాల క్రీడా ప్రతిభను సానపెట్టేందుకే సీఎం కపూర్ పోటీ నిర్వహించామని ఇది ఒక నిరంతర కార్యక్రమంలో గా కొనసాగిస్తామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఈరోజు ఎల్బీ ఇండోర్ స్టేడియంలోరెండవ విడత సీఎం కప్ పోటీల ముగింపు ఉత్సవాలు రాష్ట్ర స్థాయి వివరాలు ఛాంపియన్షిప్ టీమ్లకు ప్రాసీల బహుకరణ జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న మట్టిలో మాణిక్యాలను గుర్తించేందుకే రెండు విడతలుగా సీఎం క పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఒక నిరంతర ప్రక్రియ లాగా దీనిని ప్రతి సంవత్సరం కొనసాగిస్తామని తెలిపారు.క్రీడల్లో విజయం సాధించాలంటే కేవలం ప్రభుత్వ ప్రోత్సాహం మాత్రమే క్రీడాకారులకు కృషి పట్టుదల ఉండాలని అప్పుడు మాత్రమే క్రీడాకారులు చాంపియన్లుగా తీర్చిదిద్దబడతారని తెలిపారు.యువ క్రీడాకారులకు సైనా నెహ్వాల్ వంటి క్రీడాకారుల జీవితం స్ఫూర్తి కావాలని ఆయన అన్నారు.సీఎం క పోటీలో పాల్గొన్న క్రీడాకారుల ప్రతించి వారికిస్పోర్ట్స్ స్కూల్లో అకాడమీ లలో అవసరమైతే ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు.స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ




తెలంగాణ క్రీడా ప్రతిభ గుర్తింపు కొరకే సీఎం కప్ పోటీలు ర్వహిస్తున్నామని, ఇది నిరంతరం జరిగే ప్రక్రియ లాగా ముందుకు వెళ్తామని తెలిపారు.క్రమశిక్షణ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు, ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం కప్ పోటీల విజయవంతంలో క్రీడా సంఘాల భాగస్వామ్యం ఎంతో ఉందని, ఎన్నో ప్రభుత్వ శాఖలు విభాగాలు సహకారం వల్లనే పోటీలు విజయవంతంగా కొనసాగాయని తెలిపారు.మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూ, సీఎం క పోటీలలో దాదాపు 5 లక్షల 40 వేల మంది క్రీడాకారులు ఆన్లైన్లో నమోదు చేసుకోగా, వారి సంపూర్ణ సమాచారాన్ని క్రీడా అవసరాలకు అనుగుణంగా క్రోడీకరిస్తున్నామని తెలిపారు.

ఓవరాల్ ఛాంపియన్ గా అదిలాబాద్...

గ్రామీణ మండల అసెంబ్లీ జిల్లా రాష్ట్రస్థాయి ఐదుఅంచల్లో కొనసాగిన ఈ పోటీల్లో అది ఉమ్మడి అదిలాబాద్ జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్ గా నిలబడగా, రెండో స్థానంలో రంగారెడ్డి జిల్లా మూడో స్థానంలో కరీంనగర్ జిల్లా నిలిచాయి.విజేతలకు మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి సైనా నెహ్వాల్ సోని బాలాదేవిలు ట్రోఫీలు అందజేశారు. సీఎం కప్ పోటీల విజయవంతంకి కృషిచేసిన వివిధ ప్రభుత్వ ప్రైవేటు సంస్థలకు స్పోర్ట్స్ అథారిటీ ఘనంగా సన్మానం చేసి జ్ఞాపికలను బహూకరించింది.ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల డివైఎస్ఓ లు, క్రీడా సంఘాల ప్రతినిధులు స్పోర్ట్స్ అథారిటీ కోచులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి వేడుకలు అధికారికంగా ఘనంగా నిర్వహించాలి...

### అంబేద్కర్ భవన్ నిర్మాణాన్ని మీ హయాంలోనే ప్రారంభించాలి...

### మేయర్‌కు బీఆర్ఎస్ నేత నీరటీ శ్రీనివాస్ విజ్ఞప్తి...

గోదావరిఖని//మార్చి 24 (ఆకాంక్ష) :డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 136వ జయంతి ఉత్సవాలను గతంలో నిర్వహించిన విధంగానే ఈసారి కూడా గోదావరిఖని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు మేయర్ ఆధ్వర్యంలో అధికారికంగా ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు దళితుల సమస్యలపై పూర్తి అవగాహన కలిగిన ప్రజాప్రతినిధులుగా ఎమ్మెల్యే, మేయర్‌లు ముందుండి అంబేద్కర్, బాబు జగ్జీవన్ రాం, మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను వైభవంగా జరిపించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు నీరటీ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలు సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. అంబేద్కర్ చూపిన సమానత్వం, సామాజిక న్యాయం, విద్యా సాధికారత మార్గంలోనే సమాజం ముందుకు సాగాలని అన్నారు. అలాంటి మహనీయుల జయంతి ఉత్సవాలను



అధికారికంగా నిర్వహించడం ద్వారా యువతకు వారి సేవలను గుర్తు చేసే అవకాశం కలుగుతుందని అభిప్రాయ పడ్డారు. అలాగే బాబు జగ్జీవన్ రాం, జ్యోతిరావు పూలే, అంబేద్కర్ వంటి మహనీయుల జయంతి వేడుకలను మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి దళిత, బహుజన సమాజంలో చైతన్యం పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దళితుల ఐక్యతను మరింత బలోపేతం చేయడానికి ప్రజాప్రతినిధులు ప్రత్యేక కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఇదే సందర్భంగా అంబేద్కర్ భవన్ నిర్మాణాన్ని ప్రస్తుత పాలకుల హయాంలోనే ప్రారంభించాలని నీరటీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దళిత సమాజానికి ఉపయోగపడేలా అంబేద్కర్ భవన్ నిర్మాణం త్వరితగతిన చేపట్టి, సామాజిక కార్యక్రమాలు, సమావేశాలు, అవగాహన కార్యక్రమాలకు ఉపయోగపడే కేంద్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే అంబేద్కర్ అభయ హస్తం అమలుకు కూడా కృషి చేసి దళితుల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.దళితుల సమస్యల పట్ల స్పందించే ప్రజాప్రతినిధులుగా మేయర్ ముందడుగు వేసి మహనీయుల జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం ద్వారా మంచి సందేశం వెళ్లే అవకాశం ఉందని నీరటీ శ్రీనివాస్ పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం బలోపేతం కావాలంటే అంబేద్కర్ ఆశయాల అమలే నిజమైన నివాళి అవుతుందని ఆయన అన్నారు.

## హర్మూజ్‌లో శత్రుత్వం లేని నౌకలకే అనుమతి- కానీ షరతులు తప్పవ్ : ఇరాన్

### హర్మూజ్ జలసంధిపై ఇరాన్ కీలక నిర్ణయం

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ ఇంధన జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిపై ఇరాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. శత్రుత్వం లేని నౌకలకు ప్రయాణానికి అనుమతి ఇస్తామని ప్రకటించింది. అయితే ఈ అనుమతి కొన్ని కఠిన షరతులతోనే వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యూయార్క్‌లోని ఇరాన్ మిషన్ ఎక్స్ లో పోస్ట్ చేసింది. 'ఇరాన్‌పై దాడులకు మద్దతు ఇవ్వని దేశాల, భద్రతా నియమాలను పాటించే నౌకలకు మాత్రమే అనుమతి ఉంటుంది. అది కూడా ముందస్తు అనుమతితో హర్మూజ్ జలసంధి గుండా సురక్షితంగా ప్రయాణించవచ్చు' అని ఇరాన్ మిషన్ తెలిపింది. ఇకపై హర్మూజ్ గుండా ప్రయాణం చేయాలంటే ఇరాన్ అధికారుల మందుస్తు సమన్వయంపై ఆధారపడి ఉంటాయని ఆ దేశ రక్షణ మండలి ప్రకటించింది. ఈ నిర్ణయం అమెరికా-ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో తీసుకున్నదని తెలిపింది.

ట్రంప్ వ్యాఖ్యలను ఖండించిన ఇరాన్

మరోవైపు అమెరికాతో ప్రస్తుతం ఎలాంటి దౌత్య మార్గాలు తెరిచి లేవని స్పష్టం చేస్తూ, చర్చల కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ కొట్టిపారేసింది. అవి నిజమైన చర్చలకోసం కాకుండా మార్కెట్లను ప్రభావితం చేసే ప్రయత్నమని భారత్ లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీ తెలిపారు. ఓ వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతం అమెరికాతో ఎలాంటి చర్చలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా గానీజరగడం లేదు. ట్రంప్ సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలు ఆర్థిక, చమురు మార్కెట్లను ప్రభావితం చేయడానికే. అమెరికా, ఇజ్రాయెల్ ఎదుర్కొంటున్న పరిస్థితుల నుంచి బయటపడటానికి ఇదో ప్రయత్నం. ట్రంప్ ఇచ్చిన 48 గంటల గడువు గానీ, దాన్ని ఐదు రోజులుగా పెంచిన నిర్ణయం గానీ ఇరాన్‌ను ప్రభావితం చేయలేదు. అల్టిమేట్ లను మేం పట్టించుకోము. నిజమైన మార్పు లేకపోతే చర్చలకు అర్థం లేదు. అమెరికా ఒకవైపు చర్చలు అంటూనే, మరోవైపు ఇరాన్ ఆర్థిక, పౌర మౌలిక వసతులపై దాడులు చేస్తోంది. ఈ పరిస్థితుల్లో డిప్లొమసీకి అవకాశం లేదు.' అని ఫతాలీ వ్యాఖ్యానించారు.



భారత పాత్రపై ప్రశంస

భారత నౌకల సముద్ర భద్రతకు సంబంధించిన ఆందోళనలపై ఫతాలీ స్పందించారు. భారత నౌకల సంఖ్య గురించి నా వద్ద కచ్చితమైన సమాచారం లేదు. అయితే, నమోదైన కేసులను పరిశీలిస్తున్నాం. వాటిలో కొన్ని ఇప్పటికే సురక్షితంగా గమ్యాన్ని చేరాయి. వాటి ప్రయాణంలో ఏవైనా జాప్యాలు జలాశయాన్ని అస్థిరపరిచేందుకు మన శత్రువులు సృష్టించిన పరిస్థితుల వల్లే జరుగుతున్నాయి. భారత్ కు మధ్యవర్తిత్వం చేసే సామర్థ్యం ఉంది. అన్ని పక్షాలతో మంచి సంబంధాలు ఉండటంతో సమస్యలను తగ్గించే పాత్ర పోషించగలదు' అని ఫతాలీ తెలిపారు.

హర్మూజ్ జలసంధి పరిస్థితి

హర్మూజ్ జలసంధిని మూసివేయలేదని ఇరాన్ రాయబారి ఫతాలీ నొక్కి చెప్పారు. అయితే తమపై దాడులకు పాల్పడిన దేశాలకు చెందిన నౌకలకు మాత్రమే పరిమితులు ఉంటాయని తెలిపారు. ఇతర దేశాల నౌకలకు సాధారణ రవాణా కొనసాగుతుందని, కొన్ని ఆలస్యాలు మాత్రం ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా జరుగుతున్నాయని పేర్కొంది.

యుద్ధంపై ఇరాన్ ధృఢసంకల్పం

ఇరాన్ యుద్ధాన్ని ప్రారంభించలేదని, కానీ అవసరమైతే చివరి వరకు పోరాడుతామని ఫతాలీ స్పష్టం చేశారు. తమపై దాడులు పూర్తిగా ఆగడం, భద్రత హామీలు ఇవ్వడం, తమ హక్కులను గౌరవించడం వంటి షరతులు నెరవేరినప్పుడే యుద్ధం ముగుస్తుందని చెప్పారు. శత్రుత్వాల ముగింపుపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. దేశాన్ని రక్షించుకోవడంలో ఇరాన్ ఏ ప్రయత్నాన్నీ వదులుకోదని తెలిపారు. శత్రువు ముందు లొంగిపోవడం కన్నా ప్రతిఘటించడానికే ఎక్కువ మూల్యం చెల్లించాలనే విషయాన్ని తమ ఇరాన్ సుప్రీం లీడర్ నుంచి నేర్చుకున్నామని అన్నారు. అధ్యక్షుడు పెజెష్కియన్ నాయకత్వంలో ఇకపై ఇరాన్ అనుసరించే విధానానికి ఇదే సూత్రమని ఆయన తెలిపారు

## ఘనంగా అంతర్జాతీయ క్షయ వ్యాధి దినోత్సవం...



నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 24 (ఆకాంక్ష) :** అంతర్జాతీయ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా బిజినేపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సృజన మాట్లాడుతూ "క్షయ వ్యాధి అంతం... అదే మన పంతం" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.క్షయ వ్యాధి అంటువ్యాధి కావడంతో దగ్గు ద్వారా వ్యాపిస్తుందని, రెండు వారాలకుపైగా దగ్గు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం వైద్య సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో క్షయ వ్యాధిని సులువుగా గుర్తించి, ఉచిత మందులు మరియు పోషకాహారంతో నయం చేయవచ్చని తెలిపారు. బాధితులు తప్పనిసరిగా మాస్క్ ధరించి జాగ్రత్తలు పాటించాలని కోరారు.అనంతరం మెడికల్ కళాశాల విద్యార్థులు మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరేష్, భవిష్య భారత్ రాష్ట్ర మేనేజర్ అభి బర్ల, డిప్యూటీ మేనేజర్ కర్ణాకర్, టిబి సూపర్వైజర్లు శ్రీనివాసులు, ఆరిఫ్ ఖాన్, కార్యాలయ సిబ్బంది శ్రీకాంత్, ఏఎన్ఎంలు శ్వేత, గంగా తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విలేకరుల బైండోవర్...

### నలుగురిని బైండోవర్ చేసిన షాద్ నగర్ పోలీసులు...

షాద్ నగర్//**మార్చి 24 (ఆకాంక్ష) :** అర్ధరాత్రి వేళ రోడ్డుపై విలేకరుల అవతారం ఎత్తి దినపత్రిక పేరు చెప్పి టిప్పర్ లారీ డ్రైవర్ మరో వ్యక్తిని బెదిరించిన ఘటనలో షాద్ నగర్ పోలీసులు నలుగురు నిందితులను ఫరూక్ నగర్ తహసిల్దార్ నాగయ్య ముందు ప్రవేశపెట్టారు. మండలంలోని పీర్లగూడెం గేట్ వద్ద నలుగురు వ్యక్తులు విట్యాల గ్రామానికి చెందిన వొగ్గుల రాజు యాదవ్, గడియారం రాఘవేంద్ర గౌడ్, పీర్లగూడెం గ్రామానికి చెందిన ఆకుల మోని జగన్, గంగాధర్ పల్లికి చెందిన బోయ శ్రీశైలంలు టిప్పర్ లారీ డ్రైవర్ గంగ భూయాన్ ను బెదిరించారు. 20వేల రూపాయలు ఇవ్వాలని లేకపోతే వాహనాన్ని సీజ్ చేస్తామని బెదిరిస్తూ డబ్బులు ఇవ్వనందుకు వాహనాన్ని వెంట తీసుకువెళ్లి డ్రైవర్ వద్ద కొంత నగదు గుంజుకుని, దాడి చేసి నిర్మానుష ప్రదేశంలో వదిలిపెట్టారు. ఈ వ్యవహారంలో స్థానిక పోలీసులు ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు జరిపి నలుగురిపై సంబంధిత సెక్షన్లతో సీఐ సీతారాం కేసు నమోదు చేశారు. మంగళవారం ఫరూక్ నగర్ మండలం తహసిల్దార్ నాగయ్య ముందు పోలీసులు బైండోవర్ చేశారు. సత్ప్రవర్తనతో మెలగాలని మరోసారి ఫిర్యాదులు రాకూడదని తహసిల్దార్ వారిని హెచ్చరించినట్లు తెలిపారు.

### డాక్టర్ బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో

## టీబీ నిర్మూలనకు అవగాహన...

### వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో కార్యక్రమాలు...




వెల్దుర్తి//**మార్చి 24 (ఆకాంక్ష) :** వెల్దుర్తి మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం రోజు టీబీ (క్షయవ్యాధి) పై అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ బాలచంద్ర రెడ్డి గారు, డాక్టర్ శ్రీధర్ రెడ్డి గారు ప్రసిద్ధ శాస్త్రవేత్త డాక్టర్ రాబర్ట్ కాక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం టీబీ వ్యాధి పై ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ బాలచంద్ర రెడ్డి గారు, టీబీ ఒక అంటువ్యాధి అయినప్పటికీ సమయానికి గుర్తించి క్రమం తప్పకుండా మందులు వాడితే పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ముఖ్యంగా ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించడం చాలా అవసరమని చెప్పారు. సరైన మందులు తీసుకోవడం,పోషకాహారం తీసుకోవడం, ఆందోళన లేకుండా ఉండడం ద్వారా టీబీ పూర్తిగా తగ్గుతుందని ఆయన వివరించారు. డాక్టర్ శ్రీధర్ రెడ్డి గారు మాట్లాడుతూ, టీబీ వ్యాధిని తొందరగా గుర్తించడం (ఎర్లీ డయాగ్నసిస్) అత్యంత ముఖ్యమని చెప్పారు. వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ట్రూనాట్ (ఠీబవచీఫ్) పరీక్షా యంత్రం మరియు ఎక్స్‌రే సదుపాయం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎవరికైనా దీర్ఘకాలంగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ఆసుపత్రికి వచ్చి స్పూటం పరీక్షలు మరియు ఎక్స్‌రే చేయించుకోవాలని ప్రజలకు సూచించారు.కార్యక్రమంలో భాగంగా టీబీ పై అవగాహన సదస్సు నిర్వహించడంతో పాటు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది మరియు స్థానిక ప్రజలతో కలిసి టీబీ నిర్మూలనపై సందేశం ఇచ్చే ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా గ్రామ ప్రజలకు వ్యాధి నివారణ మరియు చికిత్సపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బాను మంజీరా డాక్టర్ రాజశేఖర్,డాక్టర్ భారతీ దేవి, డాక్టర్ శ్రీవాణి డాక్టర్ హర్షిక, ఎంఎల్పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా ప్రజల్లో టీబీ వ్యాధి పై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని వైద్యులు తెలిపారు.

### సింగరేణి కార్మికులకు నెలకు

## రూ.10,000 పెన్షన్ వెంటనే అమలు చేయాలి...

### పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ...



గోదావరిఖని//**మార్చి 24 (ఆకాంక్ష) :** సింగరేణి కార్మికుల సంక్షేమం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించి, రిటైర్ అయిన కార్మికులకు నెలకు కనీసం రూ.10,000 పెన్షన్‌ను తక్షణమే అమలు చేయాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ డిమాండ్ చేశారు. దశాబ్దాల పాటు గనుల్లో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసిన కార్మికులకు రిటైర్మెంట్ అనంతరం గౌరవప్రదమైన జీవితం కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీ కృష్ణ మాట్లాడుతూ, సింగరేణి కార్మికులు తమ జీవితాన్ని గనుల్లో శ్రమిస్తూ దేశ ఆర్థికాభివృద్ధికి విశేషంగా తోడ్పడ్డారని అన్నారు. అలాంటి కార్మికులు పదవీ విరమణ అనంతరం కనీస భద్రత కూడా లేక ఇబ్బందులు పడటం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. వారికి నెలకు కనీసం రూ.10,000 పెన్షన్ అందించడం ఉపకారం కాదని, అది వారి న్యాయమైన హక్కు అని ఆయన అన్నారు.రిటైర్డ్ సింగరేణి కార్మికుల పెన్షన్ సమస్యపై ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి ప్రాతినిధ్యాలు అందజేసినా ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోక పోవడం దురదృష్టకరమని ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల శ్రమను గుర్తించి వారికి తగిన గౌరవం, భద్రత కల్పించేలా ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు.సింగరేణి సంస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర అపారమైందని, వారి కష్టఫలితంగానే సంస్థ దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని గడ్డం వంశీ కృష్ణ అన్నారు. అలాంటి కార్మికుల సంక్షేమాన్ని విస్మరించడం సమంజసం కాదని, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.చివరగా సింగరేణి కార్మికుల న్యాయమైన డిమాండ్ అయిన నెలకు రూ.10,000 పెన్షన్‌ను తక్షణమే అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ డిమాండ్‌పై ప్రభుత్వం స్పందించకపోతే కార్మికుల హక్కుల కోసం పోరాటం మరింత ఉధృతం అవుతుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ స్పష్టం చేశారు.

## గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు స్థలం ఇవ్వాలి...

### ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి: సిపిఐ డిమాండ్...



వెల్దుర్తి //**మార్చి 24 (ఆకాంక్ష) :** పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపు మరియు గృహ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో వెల్దుర్తి ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఈ నిరసన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు కనీసం 3 సెంట్లు స్థలం, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు స్థలం కేటాయించాలని, అలాగే ఇళ్ల నిర్మాణానికి ప్రతి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా 456, 565/ూ సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిలో దరఖాస్తు చేసిన ప్రతి అర్హుడికి ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. సిపిఐ కార్యాలయానికి కూడా ప్రత్యేకంగా స్థలం కేటాయించాలని వారు కోరారు.గత ప్రభుత్వ కాలంలో కొండలు, గుట్టల ప్రాంతాల్లో వైయస్సార్ జగనన్న కాలనీలు ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలకు సౌకర్యవంతమైన మరియు అనుకూలమైన ప్రదేశాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, సిపిఐ మండల కార్యదర్శి టి. కృష్ణ, సీనియర్ నాయకుడు డి. రాజు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిపిఐ పట్టణ కార్యదర్శి గిరి, సహాయ కార్యదర్శి చిన్నమాదులు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి కోకిలరాజు, మండల నాయకులు మాధవ స్వామి, అనిల్, రాముడు, సుదేపల్లె నాయకులు తిమ్మయ్య, నాగమద్దయ్య, సీమోను, భాష, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగమద్దయ్య, మండల నాయకులు రామాంజనేయులు, చిన్నమాదులు తదితరులు పాల్గొన్నారు.అలాగే ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసిన లబ్ధిదారులు మరియు మహిళలు కూడా పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొని తమ డిమాండ్లకు మద్దతు తెలిపారు.

## రైతులు, దళితుల సమస్యలపై కేంద్రానికి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ విజ్ఞప్తి...



గోదావరిఖని//**మార్చి 24 (ఆకాంక్ష) :** రైతులు ఎదుర్కొంటున్న ఎరువుల కొరత, దళిత వ్యాపారులు అభివృద్ధిలో ఎదుర్కొంటున్న ఆర్థిక-సామాజిక అవరోధాలపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీ కృష్ణ విజ్ఞప్తి చేశారు. ప్రజలకు సంబంధించిన కీలక అంశాలను పార్లమెంట్ వేదికగా ప్రస్తావిస్తూ, రైతు సంక్షేమం మరియు దళిత సాధికారతపై స్పష్టమైన విధానాలు తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకంగా యూరియా కొరత సమస్యపై ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగానికి ఎరువులు సమయానికి అందకపోతే పంటల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. రైతులకు అవసరమైన ఎరువుల సరఫరా నిరంతరాయంగా జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.రామగుండం ఫర్టిలైజర్ ప్లాంట్ పనితీరుపై కూడా గడ్డం వంశీ కృష్ణ విమర్శలు గుప్పించారు. ప్లాంట్ నిర్వహణలో లోపాలు ఉన్నట్లు కనిపిస్తున్నాయని, ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించకపోవడం వల్ల లక్ష్యాలు చేరుకోవడం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్లాంట్ అభివృద్ధికి తగిన పెట్టుబడులు పెట్టడమే కాకుండా, పరిపాలనా వ్యవస్థలో కూడా అవసరమైన మార్పులు తీసుకురావాలని సూచించారు. రామగుండం వంటి కీలక ఎరువుల ఉత్పత్తి కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు.దళిత వ్యాపారుల సమస్యలను కూడా ఎంపీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశంలో స్టార్టప్‌ల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, దళిత వ్యవస్థాపకులకు అవసరమైన నెట్‌వర్క్‌లు, ఆర్థిక వనరులు, పెట్టుబడుల అవకాశాలు సరైన స్థాయిలో అందుబాటులో లేవని ఆయన అన్నారు. దీంతో దళిత యువత వ్యాపార రంగంలో ముందుకు రావడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.ఈ పరిస్థితుల్లో దళిత వ్యాపారులకు పన్ను రాయితీలు కల్పించాలని, దళితులను ఉద్యోగాల్లో నియమించే సంస్థలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. అలాగే దళితులకు సులభంగా రుణాలు, పెట్టుబడులు అందే విధంగా ప్రత్యేక విధానాలు తీసుకురావాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ మద్దతు లభిస్తే దళిత వ్యాపారులు కూడా దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషించగలరని ఆయన పేర్కొన్నారు. దేశ అభివృద్ధిలో ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎంపీ గడ్డం వంశీ కృష్ణ స్పష్టం చేశారు. రైతులు, దళితులు, వెనుకబడిన వర్గాల సమస్యలను పరిష్కరించడం ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పార్లమెంట్‌లో ప్రస్తావించిన ఈ అంశాలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### శ్రీరామనవమి, పట్టాభిషేక మహోత్సవాలకు

## పటిష్ట పోలీసు చర్యలు...

కొత్తగూడెం//**మార్చి 24 (ఆకాంక్ష) :** భద్రాచలంలో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న శ్రీరామనవమి, పట్టాభిషేక మహోత్సవాలకు విచ్చేయనున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన చర్యలు చేపడుతోందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఐపీఎస్ తెలిపారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ భక్తులకు సౌకర్యవంతమైన ఏర్పాట్లు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ఆయన వెల్లడించారు.మహోత్సవాల సందర్భంగా భక్తులు పార్కింగ్ స్థలాలు, కళ్యాణ మంటపం, వివిధ సెక్టార్లు, లడ్డూ మరియు తలంబ్రాల కౌంటర్లను సులభంగా గుర్తించి చేరుకునేలా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఒక క్యూఆర్ కోడ్‌తో పాటు ఆన్‌లైన్ లింకును రూపొందించినట్లు ఎస్పీ వివరించారు. ఈ సౌకర్యం ద్వారా భక్తులు భద్రాచలంలో తాము చేరాల్సిన ప్రదేశాలను సులభంగా గుర్తించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా మహోత్సవాలలో పాల్గొనవచ్చని తెలిపారు. రామనవమి, పట్టాభిషేక మహోత్సవాల రెండు రోజులపాటు భద్రాచలంలో భారీగా భక్తుల రాకపోకలు ఉంటాయని దృష్టిలో పెట్టుకొని సుమారు 2,000 మంది పోలీసు సిబ్బందితో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ రోహిత్ రాజ్ పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలు కట్టుదిట్టం చేస్తున్నామని, ట్రాఫిక్ నియంత్రణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన తెలిపారు.అదేవిధంగా మహోత్సవాల రోజుల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసు శాఖ విధించే ఆంక్షలకు భద్రాచలం పట్టణ ప్రజలు, పరిసర ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. భక్తులందరూ పోలీసు శాఖ అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని, శాంతి భద్రతల పరిరక్షణలో తమ వంతు సహకారం అందించాలని కోరారు.ఈ మహోత్సవాలను భక్తులకు ఇబ్బందులు లేకుండా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమగ్ర చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు.

### ప్రధాన రహదారిపై

## ఉన్న ఎస్ఎస్‌బీ ఇటుకబట్టిపై చర్యలు తీసుకోవాలి...

### కౌన్సిలర్ పోతరబోయిన శ్రీలతక్రాంతి...




మంథని//**మార్చి 24 (ఆకాంక్ష) :** మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురిబొయిన్‌పేట్ ప్రధాన రహదారి మధ్యలో కొనసాగుతున్న ఎస్ఎస్‌బీ ఇటుకబట్టి అనేక ప్రమాదాలు, మరణాలకు కారణమవుతోందని, దానిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని బొయిన్‌పేట్ 6వ వార్డు కౌన్సిలర్ పోతరబోయిన శ్రీలతక్రాంతి డిమాండ్ చేశారు. ఈ మేరకు బొయిన్‌పేట్ ప్రజల తరఫున జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి, ఇటుకబట్టి అనుమతిని వెంటనే రద్దు చేసి అక్కడి నుంచి తొలగించాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇటుకబట్టి యజమాని కనీస నిబంధనలు కూడా పాటించకుండా యథేచ్ఛగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇటుకబట్టికి అవసరమైన బొగ్గును సరైన అనుమతులు లేకుండా అక్రమంగా తరలించి వినియోగిస్తున్నారని, ఇన్నేళ్లుగా బొగ్గు ఎక్కడి నుంచి కొనుగోలు చేస్తున్నారు, వాటికి సంబంధించిన అనుమతిపత్రాలు ఉన్నాయా లేదా అనేది అధికారులు సమగ్రంగా పరిశీలించాలని కోరారు. ఇటుకల తయారీకి వినియోగిస్తున్న మట్టి ఎక్కడి నుంచి తవ్వి తీసుకొస్తున్నారు, దానికి సంబంధించిన అనుమతులు ఉన్నాయా అనే అంశాలపైనా దర్యాప్తు జరపాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఇటుకబట్టి నడుస్తుండటంతో తీవ్ర వాయు కాలుష్యం ఏర్పడుతోందని, బట్టీ నుంచి ఎగసిపడుతున్న బూడిదరేణువులు వాహనదారుల కళ్లల్లో పడటంతో ఇప్పటికే వందల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు సంభవించాయని, పదుల సంఖ్యలో ప్రాణనష్టం జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇటుకబట్టీ సమీపంలో విద్యుత్ వైర్లు ఉండటంతో అక్కడికి వచ్చే లారీల కారణంగా విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు మరణించిన ఘటనలు కూడా జరిగాయని పేర్కొన్నారు.



ఇటుకబట్టీ నుంచి వచ్చే దుమ్ము, బూడిద ప్రజల ఇళ్లలోకి చేరడంతో పాటు తాగునీటి ట్యాంకుల్లోకి, ఆహార పదార్థాల్లోకి కలుస్తూ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని శ్రీలతక్రాంతి ఆరోపించారు. అంతేకాకుండా ప్రభుత్వ భూమిని ఆక్రమించి నడిరోడ్డుపై సరైన ప్రమాణాలు, నిబంధనలు పాటించకుండా ఇటుకబట్టిని కొనసాగిస్తున్నారని విమర్శించారు. కార్మికులకు కార్మిక చట్టాల ప్రకారం కనీస వసతులు కూడా కల్పించకుండా, వారి పిల్లలకు విద్య, వైద్య సదుపాయాలు లేకుండానే పనులు చేయిస్తున్నారని ఆరోపించారు.ఇటీవల మంత్రి శ్రీధర్ బాబు గంగాపురి నుంచి బొయిన్‌పేట్‌కు బొక్కలవాగు మీదుగా భారీ వంతెన మంజూరు చేసిన నేపథ్యంలో, ఈ ఇటుకబట్టీ కారణంగా వంతెన నిర్మాణ పనులకు ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉందని, భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు జరగవచ్చని ఆమె హెచ్చరించారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, రహదారి భద్రత దృష్ట్యా ఎస్ఎస్‌బీ ఇటుకబట్టిపై తక్షణ చర్యలు తీసుకుని, దాని అనుమతిని రద్దు చేసి అక్కడి నుంచి తొలగించాలని బొయిన్‌పేట్ ప్రజల తరఫున అధికారులను కోరుతున్నట్లు తెలిపారు.

### భద్రాద్రి కొత్తగూడెం నుండి

## తిరుపతి,షిరిడి కి ప్రత్యేక రైళ్ళు ఏర్పాటు చేయాలి...

### కొత్తగూడెం రైల్వే స్టేషన్ మేనేజర్ కి వినతి పత్రం అందజేత...



కొత్తగూడెం//**మార్చి 24 (ఆకాంక్ష) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గం వ్యాపారస్థులు కొత్తగూడెం రైల్వేస్టేషన్ మేనేజర్ నీ కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి అనేక మంది నిత్యం కలియుగ దైవం అయిన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దర్శనార్థం తిరుపతి కి మరియు ప్రఖ్యాతి గాంచిన షిరిడి శ్రీ సాయి బాబా దర్శనార్థం అనేక మంది భక్తులు నిత్యం వేలాదిగా జిల్లా నలుమూలల నుండి తరలి వెళ్తున్నారని అనుకూలమైన ప్రయాణ సౌకర్యం లేక అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారు. తిరుపతి,షిరిడి వెళ్ళాలి అంటే ఖమ్మం లేదా విజయవాడ వెళ్ళే పరిస్థితి ఏర్పడుతుంది అదే కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుండి ప్రత్యేక రైళ్ళు ఏర్పాట్ చేస్తే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందని రైల్వే కి కూడా లాభాలు బాటలో ఉంటాయని అభివృద్ధి చెందిన జిల్లా పారిశ్రామిక ప్రాంతం కేటిపిఎస్,నవభారత్ ,పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలం ఇలా అనేక అభివృద్ధిలో ముందంజలో ఉన్న ఈ జిల్లా కి కచ్చితంగా ప్రత్యేక రైళ్ళు ఏర్పాటు చేయాలని వ్యాపారస్థులు వారి యొక్క విన్నపం స్టేషన్ మేనేజర్ కి తెలియజేశారు. ఈ కార్యక్రమములో లక్ష్మి నారాయణ,దుర్గ ప్రసాద్, రాహుల్, లక్ష్మణ్, తిరుపతయ్య, పవన్,రాజేష్, శంకర్,కృష్ణ మూర్తి, చిన్న స్వామి, కాశి,మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## మంథనిలో అంగన్వాడీల ధర్నా...

### అసెంబ్లీలో సమస్యలపై తీర్మానం చేయాలని డిమాండ్...



మంథనిరూరల్//**మార్చి 24 (ఆకాంక్ష) :** అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తూ మంథనిలో సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం అంగన్వాడీలు రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం రెవెన్యూ డివిజనల్ అధికారికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వనజరాణి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీలకు కనీస వేతనం రూ.18 వేలుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులకు పీఎఫ్ సౌకర్యం కల్పించడంతో పాటు ఐసిడిఎస్‌కు సరిపడా నిధులు కేటాయించాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం (ఎన్ఈపీ)కు వ్యతిరేకంగా ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రీ-ప్రైమరీ విద్యను అంగన్వాడీ కేంద్రాల్లోనే కొనసాగించాలని, 2026 విద్యా విధానంలో అవసరమైన సవరణలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా అంగన్వాడీల్లో ఒక పూట బడి నిర్వహణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.అదేవిధంగా మే నెలలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు ఒకేసారి ఎలాంటి ఆటంకాలు లేకుండా సెలవులు అమలు చేయాలని, అంగన్వాడీలకు క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించి, సమ్మె కాలంలో కుదిరిన ఒప్పందాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకురాళ్లు కే. కుమారి, స్వరూప, సుగుణ, శోభ, సులోచన, భాగ్య, సుజాత తదితర అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

# గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందవద్దు...

తగినంత నిల్వలు అందుబాటులోనే ఉన్నాయి...

బుకింగ్ వరుస క్రమంలోనే సిలిండర్ల పంపిణీ జరుగుతుంది...

జిల్లా పౌర సరఫరాల అధికారి ఎల్. బుచ్చిబాబు...



రాజన్న సిరిసిల్ల//**మార్చి 24 (ఆకాంక్ష) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో వంట గ్యాస్ వినియోగదారులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని జిల్లా పౌర సరఫరాల అధికారి ఎల్. బుచ్చిబాబు స్పష్టం చేశారు. జిల్లాలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లకు సంబంధించి తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని, వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సరఫరా వ్యవస్థను క్రమబద్ధంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ వినియోగదారులు బుకింగ్ చేసుకున్న వరుస క్రమం ప్రకారమే గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్లను డెలివరీ చేస్తున్నాయని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో గ్యాస్ బుకింగ్ చేసిన వినియోగ దారులకు 25 రోజుల్లోపు, గ్రామీణ ప్రాంతాల్లో బుకింగ్ చేసిన వారికి 45 రోజుల్లోపు సిలిండర్లను సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఏజెన్సీల వద్ద అందుబాటులో ఉన్న నిల్వల ఆధారంగా, బుకింగ్ తేదీలను అనుసరించి గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరుగుతుందని ఆయన వివరించారు. సరఫరా ప్రక్రియపై ప్రజలు అపోహలకు గురికాకుండా అధికారుల సూచనలు పాటించాలని కోరారు. నిల్వల కొరత ఉందన్న అనవసర ప్రచారాలను నమ్మవద్దని, ప్రతి వినియోగదారునికీ నిర్దేశిత క్రమంలో గ్యాస్ అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో గ్యాస్ సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ఎక్కడైనా పంపిణీకి సంబంధించి ఇబ్బందులు ఎదురైతే సంబంధిత గ్యాస్ ఏజెన్సీని లేదా పౌర సరఫరాల శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. వినియోగదారులు సహనం పాటించి, బుకింగ్ తేదీల ప్రకారం సరఫరా వ్యవస్థకు సహకరించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి ఎల్.బుచ్చిబాబు విజ్ఞప్తి చేశారు.

# ఏసీబీ వలలో ఎస్సై వెంకటేశ్వర్లు..

రూ.15 వేల లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ అధికారి..

ఇసుక లారీ విడుదలకు డబ్బులు డిమాండ్ చేసిన ఎస్సైపై అవినీతి నిరోధక శాఖ పంజా..

సిద్దిపేట//**మార్చి 24 (ఆకాంక్ష) :** సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఓ పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కిన ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఇసుక లారీని విడుదల చేసేందుకు లంచం డిమాండ్ చేసిన ఎస్సై వర్లుకొండ వెంకటేశ్వర్లు ఏసీబీ వలలో పడినట్లు అధికారులు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే ఫిర్యాదుదారుడికి చెందిన ఇసుక లారీని విడిచి పెట్టేందుకు ఎస్సై వెంకటేశ్వర్లు మొదట రూ.20 వేల లంచం కోరినట్లు తెలిసింది. అనంతరం రూ.15 వేలకే ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో కానిస్టేబుల్ బి. సత్యనారాయణ ద్వారా గూగుల్ పే రూపంలో లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పక్కా సమాచారంతో దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రస్తుతం నిందితుడైన ఎస్సై వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు, అతన్ని కరీంనగర్‌లోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నారు. ఈ ఘటనపై తదుపరి విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. గతంలో ముస్తాబాద్ ఎస్హెచ్‌ఓగా పనిచేసిన వెంకటేశ్వర్లు అవినీతి ఆరోపణలతో ఏసీబీ వలలో చిక్కుకోవడం స్థానికంగా సంచలనంగా మారింది. ప్రజలు అవినీతికి వ్యతిరేకంగా ముందుకు రావాలని, ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.

## సిరిసిల్లలో టాస్క్ రీజనల్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత ఐసెట్ శిక్షణ...

డిగ్రీ విద్యార్థులకు సువర్ణావకాశం...

మార్చి 31లోపు నమోదు చేసుకోవాలని సూచన...

రాజన్నసిరిసిల్ల//**మార్చి 24 (ఆకాంక్ష) :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) రీజనల్ సెంటర్ ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకు, అలాగే డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఐసెట్ ఉచిత శిక్షణ అందించనున్నట్లు కేంద్ర ప్రతినిధులు తెలిపారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలని లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా ఐసెట్ పరీక్షకు అవసరమైన మార్గదర్శకత్వం, అంశాల వారీగా శిక్షణ, పరీక్షా విధానంపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో ఉన్నత విద్యలో ప్రవేశం పొందాలనుకునే యువతకు ఈ ఉచిత శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన డిగ్రీ విద్యార్థులు ఈ నెల మార్చి 31వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న టాస్క్ రీజనల్ సెంటర్‌ను నేరుగా సంప్రదించి నమోదు చేసుకోవచ్చని వెల్లడించారు. శిక్షణకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 9573420718 లేదా7075522671 నంబర్లను సంప్రదించాలని సూచించారు. నిరుద్యోగ యువత, ఉన్నత విద్యను ఆశిస్తున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని టాస్క్ ప్రతినిధులు పిలుపునిచ్చారు.

## నిద్రమత్తులో డ్రైవింగ్‌పై

# బీమారం పోలీసుల ప్రత్యేక చర్యలు...

డ్రైవర్లకు అవగాహన కల్పిస్తూ రోడ్డు భద్రతకు ప్రాధాన్యం...





మంచిర్యాల//**మార్చి 24 (ఆకాంక్ష) :** రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్ బీమారం పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రివేళల్లో నిద్రమత్తులో వాహనాలు నడపడం వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రామగుండం పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు బీమారం ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. రాత్రి సమయంలో పహారా నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది నిద్రమత్తులో వాహనాలు నడుపుతున్న డ్రైవర్లను గుర్తించి, వారికి వెంటనే విశ్రాంతి అవసరాన్ని తెలియజేస్తున్నారు. డ్రైవర్లను అప్రమత్తం చేస్తూ ముఖం కడగించడంతో పాటు టీ తాగించించి కొంతసేపు వారితో మాట్లాడి నిద్రమత్తు తగ్గేలా చర్యలు తీసుకుంటున్నారు. అనంతరం పరిస్థితి సాధారణ స్థితికి వచ్చిన తర్వాత మాత్రమే ప్రయాణం కొనసాగించాలని సూచిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసులు డ్రైవర్లకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు. అలసటగా లేదా నిద్రమత్తుగా అనిపించినప్పుడు వాహనం నడపకూడదని, అవసరమైతే సమీపంలోని సురక్షిత ప్రదేశంలో ఆగి విశ్రాంతి తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో దీర్ఘదూర ప్రయాణాలు చేసే వారు మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడడం, రోడ్డు ప్రమాదాలను తగ్గించడం ప్రధాన లక్ష్యంగా బీమారం ఎస్ఐ రాజేందర్ మరియు పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. రాత్రి వేళల్లో వాహన దారులు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని, అలసటను నిర్లక్ష్యం చేయవద్దని, పోలీసులకు సహకరించాలని ఎస్ఐ రాజేందర్ విజ్ఞప్తి చేశారు.

# జాతీయ మెగా లోక్ అదాలత్‌కు రామగుండం సీపీ పిలుపు...

లోక్ అదాలత్ ద్వారా సామరస్యంతో

సమస్యల ముగింపు సాధ్యమని వెల్లడి...

రాజీ మార్గంలో వివాదాల పరిష్కారమే

ఉత్తమ మార్గం...

రామగుండం సీపీ అంబర్ కిషోర్...



గోదావరిఖని//**మార్చి 24 (ఆకాంక్ష) :** ఈ నెల 28వ తేదీ శనివారం నిర్వహించబడనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. లోక్ అదాలత్ ద్వారా వివాదాలు శాంతియుతంగా, సామరస్య వాతావరణంలో, రాజీ మార్గంలో పరిష్కారమవుతాయని ఆయన తెలిపారు. మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో సీపీ మాట్లాడుతూ, రాజీకి అనువైన క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజనకు సంబంధించిన వివాదాలు, కుటుంబ పరమైన మరియు వైవాహిక కేసులు, బ్యాంకు బకాయిల వసూలు కేసులు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ వంటి కేసుల్లో ఇరువర్గాలు లోక్ అదాలత్ వేదికగా చర్చించుకుని పరస్పర అంగీకారంతో రాజీకి రావచ్చని పేర్కొన్నారు. రాజీయే రాజమార్గం” అని పేర్కొన్న సీపీ, చిన్న చిన్న తగాదాల కారణంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని సూచించారు. జుడీషియల్ శాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకుని శాంతియుత పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పరిధిలోని అన్ని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు ఇతర పోలీస్ సిబ్బందికి ఇప్పటికే తగిన మార్గదర్శకాలు ఇచ్చినట్లు తెలిపారు. రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ సాధించేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. తమ కేసుల్లో రాజీకావాలని కోరుకునే వ్యక్తులు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని సీపీ సూచించారు. లోక్ అదాలత్ ద్వారా వివాదాలు త్వరితగతిన పరిష్కారమై బాధితులకు సత్వర న్యాయం లభిస్తుందని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ అనేది ఇరుపక్షాల సమ్మతితోనే సాధ్యమవుతుందని, అక్కడ కుదిరిన రాజీ చట్టపరంగా తుది తీర్పుగా పరిగణించబడుతుందని ఆయన వివరించారు. ప్రతి కేసులో న్యాయమూర్తులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తల సమన్వయంతో పరిష్కారం జరుగుతుందని తెలిపారు. ప్రజలు, పోలీసులు, న్యాయస్థానాలు కలిసికట్టుగా పనిచేస్తే చిన్న వివాదాలు కూడా పెద్ద సమస్యలుగా మారకుండా ముందుగానే పరిష్కరించవచ్చని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు.

# రామగుండం 29వ డివిజన్‌లో తాగునీటి సమస్య...

లింగాపూర్, ఇందిరమ్మ కాలనీల్లో నీటి ఎద్దడి...

తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్

మల్లీశ్వరి-శ్రీనివాస్ విజ్ఞప్తి...



గోదావరిఖని//**మార్చి 24 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 29వ డివిజన్‌లో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చడంతో వెంటనే చర్యలు చేపట్టాలని మాజీ సర్పంచ్ అర్షణపల్లి మల్లీశ్వరి, శ్రీనివాస్ మున్సిపల్ అధికారులను కోరారు. లింగాపూర్ గ్రామం, ఇందిరమ్మ కాలనీల్లో ఇప్పటికే నీటి కొరత అధికంగా ఉందని, వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ఈ సమస్య మరింత ఉధృతమయ్యే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేసిన అనంతరం వారు మాట్లాడుతూ, అంతర్గాం మండలంలోని లింగాపూర్ గ్రామం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం అయిన తరువాత 29వ డివిజన్‌గా ఏర్పడిందని తెలిపారు. అయితే విలీనం అనంతరం ప్రాథమిక సౌకర్యాల పరంగా తగిన చర్యలు పూర్తిస్థాయిలో అందకపోవడంతో ప్రజలు ముఖ్యంగా తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కాలంలో తవ్వించిన బోర్‌వెల్స్ ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని, వాటికి విద్యుత్ మోటార్లు అమర్చి సమీప కాలనీలకు పైప్‌లైన్ల ద్వారా నీటి సరఫరా చేయాలని వారు సూచించారు. ఈ చర్యల ద్వారా తక్షణ ఉపశమనం కల్పించవచ్చని తెలిపారు. అలాగే హౌసింగ్ బోర్డు కాలనీలో కొత్తగా బోర్‌వెల్స్ తవ్వించి, వాటికి విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి పైప్‌లైన్ల ద్వారా నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి కారణంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొనకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మాజీ సర్పంచ్‌లు పేర్కొన్నారు. తాగునీరు వంటి ప్రాథమిక అవసరాల విషయంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డివిజన్ మహిళలతో కలిసి సూపరింటెండెంట్ గురువీర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్‌లకు వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యను అత్యవసరంగా పరిగణించి తక్షణ చర్యలు చేపట్టాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గుడేల్లి స్వప్న, స్నేహ, గౌతమి, పులి రమ్య, ప్రేమ, ఎల్లక్క, అర్షణపల్లి భీమలింగం, నగు నూరీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ యూత్ నాయకుల ముందస్తు అరెస్ట్...






ఓదెల//**మార్చి 24 (ఆకాంక్ష) :** బీఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపునకు డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న “ఛలో అసెంబ్లీ” కార్యక్రమం నేపథ్యంలో పొత్కపల్లి పోలీసులు బీఆర్ఎస్ యూత్ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్‌ను అర్ధరాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు బీఆర్ఎస్వీ నాయకులు కాశవేణి నరేష్, గడ్డం అజయ్, గట్టు వినయ్ గౌడ్ తదితరులను కూడా ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు సమాచారం. అక్రమంగా అర్ధరాత్రి అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనలు తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు ఆచరణలో కనిపించడం లేదని విమర్శించారు. ప్రభుత్వం ఇలాంటి చర్యలతో ప్రజా వ్యతిరేకతను అణిచివేయలేదని, విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాలు మరింత ఉధృతమవుతాయని హెచ్చరించారు. విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ముందస్తు అరెస్టుల ఘటనతో ఓదెల మండలంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ పరిణామం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తుండగా, పోలీసులు పరిస్థితిని అదుపులో ఉంచేందుకు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

## నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయక పోతే

# దేశ వ్యాప్తంగా ఉద్యమం చేస్తాం...

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ. కృష్ణ...



గోదావరిఖనిటౌన్//**మార్చి 24 (ఆకాంక్ష) :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేసి పాత కార్మిక చట్టాలను కొనసాగించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ ఐ. కృష్ణ డిమాండ్ చేశారు. ఈ కోడ్స్ పారిశ్రామిక పురోగతికి, కార్మిక సంక్షేమానికి తీవ్ర విఘాతం కలిగించేలా ఉన్నాయని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లో డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించిన భారీ ధర్నాలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ఈ లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగిస్తున్నప్పటికీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల నిరసనలను పట్టించుకోకుండా నిరంకుశ ధోరణితో ముందుకు సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమవుతున్నా, కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి ఈ నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలు చేయడానికి సిద్ధపడటం ఆందోళనకరమని అన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, కార్మికుల హక్కులను బలహీనపరిచే విధంగా ఈ చట్టాలు రూపొందించబడ్డాయని ఐ. కృష్ణ ఆరోపించారు. కార్మిక వర్గం ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం, పెద్ద పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం శ్రమజీవుల హక్కులను తాకట్టు పెడుతోందని మండిపడ్డారు. లేబర్ కోడ్స్ అమలుకు పాల్పడితే రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా ఉద్యమాలు మరింత ఉధృతం అవుతాయని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని కూడా ఐఎఫ్‌టీయూ నాయకత్వం తీవ్రంగా ఖండించింది. హైదరాబాద్‌లో రాజ్‌భవన్ ముట్టడి, డిప్యూటీ లేబర్ కమిషనర్ ముట్టడి కార్యక్రమాలకు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివస్తున్న ఐఎఫ్‌టీయూ శ్రేణులు, నాయకత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేయడాన్ని ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. కార్మిక సంఘాల ఆందోళనలను అణచివేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, మరింత ప్రతిఘటనకు దారితీస్తుందని స్పష్టం చేశారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఐఎఫ్‌టీయూ పోరాటం మరింత ఉధృతం చేస్తుందని, నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేసే వరకు ఉద్యమాలు ఆగవని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈ. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ది మాస్టర్ మైండ్స్ హై స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే...



నల్లగొండ//**మార్చి 24 (ఆకాంక్ష) :** విద్యతో జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, ఆ లక్ష్య సాధనకు క్రమశిక్షణ అత్యంత అవసరమని నల్లగొండ ఎంఈఓ కత్తుల అరుంధతి పేర్కొన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని ది మాస్టర్ మైండ్స్ హై స్కూల్‌లో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో లక్ష్యసాధనకు తగిన దృక్పథం, క్రమశిక్షణ, కష్టపడే తత్వం పెంపొందాలని అన్నారు. పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, వేదికపై మాట్లాడే నైపుణ్యం, సృజనాత్మకత పెరుగుతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు మంచి సంస్కారాలను అలవర్చుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో యూకేజీ, ఐదవ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థుల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు హాజరైన వారిని ఆకట్టుకున్నాయి. అనంతరం యూకేజీకి చెందిన 39 మంది, ఐదవ తరగతికి చెందిన 18 మంది విద్యార్థులకు సర్టిఫికేట్లు ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ గుండెబోయిన జానయ్య యాదవ్, ఉపాధ్యాయులు జి. వెంకటేష్, క్రిస్టోఫర్, అరుణజ్యోతి, విజయనిర్మల, రుచిత, నూర్, అశ్విని, ఆస్మా, సనోబర్, దివ్య, స్వర్ణ, హేమలత తదితరులు పాల్గొన్నారు. అలాగే తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. పాఠశాల ఆవరణలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించిన ఈ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

## అనాథ, వృద్ధాశ్రమాలకు నిత్యావసరాల పంపిణీ...



ఖమ్మం//**మార్చి 24 (ఆకాంక్ష) :** ఖమ్మం మండలం పొన్నేకల్‌లోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్న జాతీయస్థాయి టెక్నికల్ అండ్ కల్చరల్ ఫెస్ట్ శ్రీ చైతన్య ఉత్సవ్-26లో భాగంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం ఖమ్మం పట్టణంలోని 13 అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలను సందర్శించి అక్కడి వారికి అవసరమైన నిత్యావసర సరుకులను పంపిణీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. బ్యాంక్ కాలనీలోని ఈశ్వరమ్మ ప్రశాంతి సదన్, ఎన్ఎస్పీ క్యాంప్‌లోని జీవన్ సంధ్య ఆశ్రమం, నాయుడుపేట క్రాస్ రోడ్డులోని భవ్యశ్రీ ఓల్డేజీ హోమ్, పెద్ద తండాలోని మెఫీ స్వచ్ఛంద సేవా సంస్థ ఫర్ చిల్డ్రన్స్, నేనున్నాను ఓల్డ్ ఏజ్ హోమ్, బల్లేపల్లిలోని మదర్ థెరిస్సా ఆశ్రమం, నేనున్నాను ఫౌండేషన్ తదితర ఆశ్రమాలను కళాశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా సుమారు 500 మంది అనాథలు, వృద్ధులకు అవసరమైన నిత్యావసర వస్తువులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ, ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు సమాజంలోని వాస్తవ పరిస్థితులపై అవగాహన పెరుగుతుందని అన్నారు. వివిధ కారణాలతో ఓల్డ్ ఏజ్ హోమ్స్‌లో నివసిస్తున్న వారికి అండగా నిలవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. అదే సమయంలో విద్యార్థులు ఎల్లప్పుడూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల పట్ల ప్రేమాభిమానాలు చూపాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ, శ్రీ చైతన్య విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా సామాజిక బాధ్యతల్లోనూ ముందుండేలా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజానికి ఉపయోగపడే విలువలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు కళాశాల యాజమాన్యం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డీన్ డాక్టర్ సుదర్శన్, ఏఓ వైశాలి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రాజేష్, డిప్లొమా ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ జ్యోతి, డాక్టర్ ప్రణతి, డాక్టర్ చార్యులు, శ్రీకుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ...

రాజన్న సిరిసిల్ల//**మార్చి 24 (ఆకాంక్ష) :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, సంబంధిత రికార్డులు, దర్యాప్తు పురోగతిని సమగ్రంగా పరిశీలించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.కేసుల దర్యాప్తులో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని, పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి చట్టపరంగా నిందితులకు శిక్ష పడేలా పటిష్టంగా వ్యవహరించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువయ్యేలా విలేజ్ పోలీస్ ఆఫీసర్ (వీపీఓ) వ్యవస్థను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. వార్డులు, గ్రామాలను నిరంతరం సందర్శిస్తూ ప్రజలతో మమేకమై నేర నియంత్రణలో చురుకుగా భాగస్వామ్యం కావాలని అధికారులకు తెలిపారు.ప్రజా ఫిర్యాదులపై ఆలస్యం చేయకుండా బాధితులకు తక్షణ స్పందన అందించాలని, పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందిస్తూ సంఘటనా స్థలానికి త్వరితగతిన చేరుకోవాలని బ్లూ కోల్ట్, పెట్రోలింగ్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. పెట్రోలింగ్ సమయంలో రౌడీ షీటర్లపై నిరంతర నిఘా కొనసాగించాలని పేర్కొన్నారు.నేరాల నివారణలో భాగంగా పట్టణంలోని కీలక ప్రదేశాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు మరింత పెంచాలని, భద్రతా వ్యవస్థను బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. అదే విధంగా రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు.ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ తనిఖీతో వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో పని తీరుపై మరింత కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగనున్నట్లు స్పష్టమైంది.d

### పాలకుర్తి మండలంలో

## కలెక్టర్ కోయశ్రీ హర్ష ఆకస్మిక తనిఖీలు...

### భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశం...



గోదావరిఖని//**మార్చి 24 (ఆకాంక్ష) :** భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయశ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం పాలకుర్తి మండలంలో పర్యటించిన కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయం, కన్నాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ సంబంధిత దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహణ తీరును పరిశీలించిన కలెక్టర్, స్లాట్ బుకింగ్ ప్రకారం రిజిస్ట్రేషన్లు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూ భారతి పోర్టల్‌లో నమోదవుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అలాగే రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన అర్జీలను కూడా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని పేర్కొన్నారు.99 రోజుల కార్యక్రమంలో భాగంగా కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఉపయోగంలో లేని పాత సామాగ్రిని పూర్తిస్థాయిలో విక్రయించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు సేవలు అందించే కార్యాలయాలు శుభ్రంగా, సక్రమంగా ఉండాలని ఆమె అన్నారు.కన్నాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న భోజనం, పాఠశాల నిర్వహణ, ప్రాథమిక విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. చిన్నారుల విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం నక్కిరెడ్డిపల్లి, కన్నాల ప్రాంతాల్లోని అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, చిన్నారుల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. నిబంధనల ప్రకారం పౌష్టికాహారం అందించడమే కాకుండా, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను సమర్థంగా అందించాలని అధికారులకు తెలిపారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ పర్యటనలో తహసీల్దార్ సునీతతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### గుండెపోటుతో మృతిచెందిన యాదగిరి భార్యకు

## శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చెక్కు అందజేత...



మెదక్//**మార్చి 24 (ఆకాంక్ష) :** మెదక్ జిల్లా నిజాంపేట్ మండలం నస్కల్ గ్రామానికి చెందిన రామిండ్ల యాదగిరి గుండెపోటుతో మృతి చెందగా, ఆయన తీసుకున్న శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ కింద నామినీ అయిన భార్య రేణుకకు మంగళవారం బీమా చెక్కును అందజేశారు. గ్రామంలో మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించిన కార్యక్రమంలో ఈ చెక్కు అందజేయడం జరిగింది.యాదగిరి అకాల మరణంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయిందని, ఇలాంటి సందర్భాల్లో బీమా పాలసీలు కుటుంబాలకు ఆర్థిక భరోసాను అందిస్తాయని కార్యక్రమంలో పాల్గొన్నవారు పేర్కొన్నారు. పాలసీ నిబంధనల ప్రకారం అవసరమైన ప్రక్రియలు పూర్తి చేసిన అనంతరం నామినీ అయిన రేణుకకు చెక్కును అందించినట్లు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మండల ఏఎస్ఐ, గ్రామ సర్పంచ్ లక్ష్మగౌడ్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ డీజీఎం నరేందర్, బ్రాంచ్ మేనేజర్ నాగరాజు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు కూడా హాజరై యాదగిరి కుటుంబానికి సానుభూతి తెలిపారు.ఇలాంటి బీమా పథకాలు అనుకోని ప్రమాదాలు, అకాల మరణాల సమయంలో కుటుంబాలకు ఆర్థిక పరంగా అండగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.

### ప్రభావిత గ్రామాల అభివృద్ధికి

## సీఎస్ఆర్ నిధుల వినియోగం చేస్తున్నాం...

### ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్ట్ ఈడీ చందన్ కుమార్ సమంత...




గోదావరిఖని//**మార్చి 24 (ఆకాంక్ష) :** రామగుండం ఎన్టీపీసీ విద్యుత్ ఉత్పత్తిలో అగ్రభాగాన నిలుస్తూనే, సీఎస్ఆర్ నిధుల ద్వారా ప్రభావిత గ్రామాల అభివృద్ధికి కట్టుబడి పని చేస్తోందని ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత తెలిపారు.మంగళవారం ఎన్టీపీసీ టీటీఎస్‌లోని మిలీనియం హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి ముందు సీనియర్ పాత్రికేయులతో కలిసి ఎన్టీపీసీ అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి, ఎన్టీపీసీ గేయంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా చందన్ కుమార్ సమంత 202526 ఆర్థిక సంవత్సరంలో ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ప్రాజెక్టుల విద్యుత్ ఉత్పత్తి పురోగతిని వివరించారు. రామగుండం ప్రాజెక్ట్ పరిధిలో 2600 మెగావాట్ల విద్యుత్ కేంద్రాలు, తెలంగాణ ఫేజ్-1 కింద 1500 మెగావాట్ల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతోందని తెలిపారు. అదనంగా 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, 10 మెగావాట్ల గ్రౌండ్ సోలార్ ప్లాంట్ ద్వారా కూడా విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందన్నారు.మరో 176 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులకు పనులు కొనసాగుతున్నాయని, ఇందులో 100 మెగావాట్ల గ్రౌండ్ సోలార్, 56 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు.202526 సంవత్సరానికి



రామగుండం విద్యుత్ ప్లాంట్ ద్వారా 13.5 బిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి 86.3 శాతం సామర్థ్యాన్ని నమోదు చేశామని, తెలంగాణ ప్రాజెక్ట్ ద్వారా 9.2 బిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి 91.4 శాతం సామర్థ్యాన్ని సాధించామని పేర్కొన్నారు.ప్రభావిత గ్రామాల అభివృద్ధి కోసం సీఎస్ఆర్ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ నిధులతో సోలార్ లైటింగ్ ఏర్పాటు, ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలల అభివృద్ధి పనులు, మహిళా అభివృద్ధి కార్యక్రమాలు, రైతులకు విత్తనాల పంపిణీ, గ్రామీణ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.ఈ విలేకరుల సమావేశంలో ఎన్టీపీసీ అధికారులు ముకుల్ రాయ్, జనరల్ మేనేజర్లు మనీష్ అగర్వాల్,అభిజిత్ దత్తా, బినోయ్ జోస్, హెచ్‌వోడీ డి.ఎస్. రావత్, ఏజీఎం హెచ్‌ఆర్ బిజోయ్ కుమార్ సిక్దర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ 21వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు...

### వెల్దుర్తి మండల మహాసభలో నూతన కమిటీ ఎన్నిక...




వెల్దుర్తి //**మార్చి 24 (ఆకాంక్ష) :** ఏఐటీయూసీ 21వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ వెల్దుర్తి ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం నాడు మండల మహాసభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కర్నూలు జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మునెప్ప హాజరయ్యారు. అలాగే ఏపీ ఆటో యూనియన్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ ఈ నెల 28, 29, 30 తేదీలలో కర్నూలు జిల్లా ఆలూరు పట్టణంలో నిర్వహించనున్న ఏఐటీయూసీ 21వ జిల్లా మహాసభలకు అనుబంధ సంఘాల కార్యకర్తలు, కార్మికులు పెద్ద ఎత్తున హాజరై మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ ఎన్నో దశాబ్దాలుగా పోరాటాలు చేస్తూ వస్తోందని ఆయన తెలిపారు.ఆయన మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న దేశ వాణిజ్య నగరమైన బొంబాయిలో స్వాతంత్ర్య సమరయోధులు లాలా లజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్, ఎస్.ఏ. డాంగే, జవహర్‌లాల్ నెహ్రూ తదితరులు కలిసి జాతీయ కార్మిక సంఘంగా ఏఐటీయూసీని స్థాపించారని గుర్తు చేశారు. ఆ రోజు నుంచి ఈరోజు వరకు కార్మికుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు, నిరాహార దీక్షలు, ధర్నాలు నిర్వహిస్తూ కార్మికులకు అండగా నిలుస్తోందన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని సాధించడంలో కూడా కార్మిక సంఘాల పోరాటాలు కీలక పాత్ర పోషించాయని తెలిపారు. కర్నూలు జిల్లా ఆలూరులో జరగబోయే ఈ మహాసభలు మన జిల్లాలో జరగడం ఎంతో సంతోషకరమని, కార్మిక సంఘాల ఐక్యతను చాటుకునే అవకాశమని ఆయన అన్నారు. అందువల్ల వేల సంఖ్యలో కార్మికులు పాల్గొని ఈ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వెల్దుర్తి ఏఐటీయూసీ మండల మహాసభలో నూతన కమిటీని కూడా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కె. యేసయ్య, ప్రధాన కార్యదర్శిగా బి. మాధవస్వామి, ఉపాధ్యక్షులుగా కే. అనిల్, బి. రామాంజనేయులు, సహాయ కార్యదర్శులుగా ఈదమ్మ, కోకిల నాగరాజు,ట్రెజరర్ గా హరిప్రసాద్‌ను ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో పదిమందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల నాయకులు హరిప్రసాద్, జి. నాగమద్దయ్య, చిన్నమాదులు, సిపిఐ పట్టణ కార్యదర్శి గిరిబాబు, అన్వర్ భాష, మబుల్, రామకృష్ణ, రత్నపల్లి, కలగొట్ల, బోయినపల్లి, లద్దగిరి, కోడుమూరు ప్రాంతాల నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆటో స్టాండ్ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, చిన్న వ్యాపారస్తులు మరియు ఇతర కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ మండల మహాసభ ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది. కార్మికుల ఐక్యతతో జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహించాలని నాయకులు పిలుపునిచ్చారు.

## మాతా శిశు సంరక్షణ కేంద్ర సేవలు మరింత మెరుగుపరచాలి...

### పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష...



పెద్దపల్లిటౌన్//**మార్చి 24 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లాలో గర్భిణీ మహిళలకు మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎం.సి.హెచ్) ద్వారా మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, రోగులు మరియు సహాయకులకు తగిన సీటింగ్ సదుపాయాలు కల్పించడం, వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మాతా శిశు సంరక్షణ కేంద్రం పనితీరుపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసవానికి సమీపంలో ఉన్న గర్భిణీ మహిళల వివరాలు తప్పనిసరిగా ఈ.డి.బీ రిజిస్టర్‌లో నమోదు కావాలని సూచించారు. 102 అమ్మ ఒడి వాహనాల ద్వారా గర్భిణీలను ఆసుపత్రికి తరలించి అవసరమైన పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.ఫిబ్రవరి నెలలో ఎం.సి.హెచ్‌లో 182 ప్రసవాలు నమోదయ్యాయని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య ఇంకా పెరగాలని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఆశా కార్యకర్తలు అందించే సమాచారాన్ని సూపర్వైజర్లు తప్పనిసరిగా క్రాస్ చెక్ చేయాలని, 102 అమ్మ ఒడి సేవలు మరింత సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రసవం తర్వాత కూడా తల్లి, బిడ్డల ఆరోగ్య సంరక్షణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, బాలింతలు మరియు శిశువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయాలని సూచించారు.మంథని ఎం.సి.హెచ్ గతంతో పోలిస్తే మెరుగ్గా పని చేస్తోందని పేర్కొన్న కలెక్టర్, మరింత మెరుగైన సేవల కోసం ఆసుపత్రిలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని అన్నారు. సిబ్బంది విధులకు సకాలంలో హాజరయ్యేలా చూడాలని, సమయపాలనపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.ఆసుపత్రి పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వైద్యులు ఓపి సేవలను టోకెన్ విధానంలో అందించాలని సూచించారు. ఓపి సమయం పూర్తయ్యిన తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు డ్యూటీ డాక్టర్ తప్పనిసరిగా ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆసుపత్రిలో అడ్మిషన్‌ను తిరస్కరించరాదని స్పష్టం చేశారు.రోగులు, వారి సహాయకుల కోసం తగిన సీటింగ్ ఏర్పాటు చేయాలని, సెక్యూరిటీ సిబ్బంది మరియు నర్సింగ్ స్టాఫ్ రోగులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. టాయిలెట్లను నిరంతరం శుభ్రం చేస్తూ పరిశుభ్రంగా ఉంచాలని, నిబంధనల ప్రకారం పారిశుధ్య సిబ్బంది అందుబాటులో ఉండి విధులు నిర్వర్తించేలా చూడాలని అన్నారు.ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాలో వరల్డ్ టిబి డే ర్యాలీ నిర్వహణ...



పెద్దపల్లిటౌన్//**మార్చి 24 (ఆకాంక్ష) :** వరల్డ్ టిబి డే సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం క్షయ వ్యాధి నివారణపై విస్తృత అవగాహన కల్పించేందుకు భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు.జిల్లా ప్రధాన ఆసుపత్రి, పెద్దపల్లి నుంచి ప్రారంభమైన ఈ అవగాహన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా అమర్చంద్ ఫంక్షన్ హాల్ వరకు కొనసాగింది. ర్యాలీలో వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, టిబి ఛాంపియన్స్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థినులు పాల్గొని టిబి వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం క్షయవ్యాధి నివారణ,లక్షణాలు,చికిత్స,జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, ఈ ఏడాది వరల్డ్ టిబి డేను "ఎస్ వుయ్ కేన్ ఎండ్ టిబి" అనే నినాదంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. క్షయవ్యాధి మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే సూక్ష్మక్రిమి వల్ల వస్తుందని, టిబి రోగి దగ్గు, తుమ్ము,మాట్లాడినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా ఇతరులకు వ్యాపించే ప్రమాదం ఉంటుందని వివరించారు.రెండు వారాలకు మించిన దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, రాత్రిపూట చెమటలు పడడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు తెమడ పరీక్ష, ఛాతి ఎక్స్-రే వంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని తొందరగా గుర్తించి చికిత్స ప్రారంభించుకోవచ్చని అన్నారు.సాధారణ టిబి బాధితులకు ప్రభుత్వం ఉచితంగా ఆరు నెలల పాటు చికిత్స అందిస్తోందని తెలిపారు. మొదటి రెండు నెలలు ఇంటెన్సివ్ దశలో నాలుగు రకాల మందులు ఇవ్వబడతాయని, అనంతరం మళ్లీ పరీక్షలు నిర్వహించి తదుపరి చికిత్స కొనసాగిస్తారని చెప్పారు. చికిత్సను మధ్యలో ఆపకుండా పూర్తి స్థాయిలో కొనసాగించడం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు.డ్రగ్ రెసిస్టెంట్ టిబి కేసులపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో చికిత్సను పూర్తిగా చేయకపోవడం వల్ల టిబి క్రిమి మందులకు ప్రతిఘటన పెంచుకునే అవకాశం ఉంటుందని, అలాంటి రోగులకు ఎనిమిది రకాల శక్తివంతమైన మందులతో ఒకటి నుంచి రెండు సంవత్సరాల పాటు దీర్ఘకాలిక చికిత్స అవసరమవుతుందని పేర్కొన్నారు.నిక్షయ్ శివిర్ 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని 2025 డిసెంబర్ 7 నుంచి 2026 మార్చి 17 వరకు నిర్వహించామని తెలిపారు. లక్ష్యంగా పెట్టుకున్న 1,64,790 మందిలో 1,52,741 మందికి ఎక్స్-రే పరీక్షలు నిర్వహించగా, 22,364 మందికి తెమడ పరీక్షలు చేసినట్లు వెల్లడించారు. వీరిలో 1,421 మందికి టిబి నిర్ధారణ కావడంతో వారికి ఉచితంగా మందులు అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్‌సీలు, పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి,రామగుండం జనరల్ ఆసుపత్రుల్లో టిబి పరీక్షలు, తెమడ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్య కేంద్రాలను సంప్రదించి సేవలను వినియోగించు కోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. శ్రీరాములు, డా. కె.వి. సుధాకర్ రెడ్డి, డాక్టర్ బి. కిరణ్ కుమార్, ఏఆర్‌టి మెడికల్ ఆఫీసర్ అలేఖ్య, ఐఆర్‌సిఎస్ అధ్యక్షులు రాజగోపాల్, డి. శ్రీనివాస్, ఎస్.వెంకటేశ్వర్లు, టిబి ఛాంపియన్స్, ఎన్‌జీవో ప్రతినిధులు, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఇతర వైద్య సిబ్బంది, తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

## సర్పంచ్ పాలన భవిష్యత్ రాజకీయాలకు బలమైన పునాది కావాలి...






నాగర్‌కర్నూల్//**మార్చి 24 (ఆకాంక్ష) :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గ్రామ స్థాయి పాలన ప్రాముఖ్యతను విశదీకరించారు. గ్రామ అభివృద్ధికి సర్పంచ్‌లు సమర్థవంతంగా నాయకత్వం వహిస్తేనే భవిష్యత్‌లో శక్తివంతమైన రాజకీయ నాయకత్వం రూపుదిద్దుకుంటుందని ఆయన పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు,పారదర్శక పాలన ద్వారా సర్పంచ్‌లు తమ వ్యక్తిగత గౌరవాన్ని కూడా పెంపొందించుకోవచ్చన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐడిఓసి ప్రధాన సమావేశ మందిరంలో కొల్లాపూర్ డివిజన్ పరిధిలోని 72 గ్రామాలకు చెందిన నూతన సర్పంచ్‌లకు నాల్గో విడత శిక్షణా తరగతులను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, దేశస్థాయిలో ప్రధానమంత్రి, రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి, జిల్లాస్థాయిలో కలెక్టర్‌కు ఉన్న బాధ్యతల మాదిరిగానే గ్రామస్థాయిలో ప్రజలే నేరుగా ఎన్నుకునే సర్పంచ్‌కు రాజ్యాంగం విశిష్టమైన బాధ్యతను కల్పించిందని తెలిపారు.సర్పంచ్‌లు రాజకీయ పార్టీల ప్రభావానికి తావు ఇవ్వకుండా గ్రామ ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని పాలన సాగించాలని కలెక్టర్ సూచించారు. సర్పంచ్ పదవిలో లభించే గౌరవం, ప్రజల మన్ననలు భవిష్యత్‌లో వ్యక్తిగత రాజకీయ అభ్యున్నతికి కూడా దోహదపడతాయని అన్నారు. ముఖ్యంగా మహిళా సర్పంచ్‌ల స్థానాల్లో కుటుంబ సభ్యుల జోక్యానికి ఆస్కారం ఇవ్వకుండా, వారు స్వయంగా తమ నాయకత్వ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు.గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ లోటుపాట్లు గుర్తిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను సమర్థంగా వినియోగిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పని చేయాలని అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణను సమర్థంగా అమలు చేయాలని, ముఖ్యంగా ఏప్రిల్ 2న నిర్వహించనున్న గ్రామసభలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. గ్రామ పాలనలో కుటుంబ సభ్యుల జోక్యానికి అవకాశం లేకుండా, ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తూ బాధ్యతాయుత పరిపాలన అందించాలని మార్గనిర్దేశం చేశారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్ మాట్లాడుతూ, సర్పంచ్‌లు ప్రజలతో మమేకమై పారదర్శకంగా పాలన సాగించాలని సూచించారు. గ్రామ పరిస్థితులపై పూర్తి అవగాహన ఉంటేనే సమస్యలను సత్వరంగా పరిష్కరించే అవకాశం ఉంటుందని చెప్పారు. పన్నులు, ఇతర స్థానిక వనరుల ద్వారా వచ్చే ఆదాయంపై దృష్టి సారించి, ఆ ఆదాయాన్ని ప్రజోపయోగ పనులకు వినియోగిస్తే గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపర్చవచ్చన్నారు. వినూత్న ఆలోచనలతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. నిధులు, విధులను సక్రమంగా వినియోగిస్తూ అందరి సమన్వయంతో గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని ఆయన సూచించారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాల్సిన బాధ్యత సర్పంచ్‌లపై ఉందన్నారు. గ్రామాల పచ్చదనం,పరిశుభ్రత కార్యక్రమాలకు కూడా అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.నాలుగో విడతలో కొల్లాపూర్, కోడేరు, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి మండలాలకు చెందిన 72 మంది నూతన సర్పంచ్‌లకు ఐదు రోజులపాటు శిక్షణ అందించనున్నట్లు అధికారులు తెలిపారు. పంచాయతీరాజ్ చట్టం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం, ఆర్థిక నిర్వహణ, సామాజిక బాధ్యతలు, పారదర్శక పాలన అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జీవి శ్యాంప్రసాద్ లాల్,అమరేందర్, డిపిఓ శ్రీరాములు, డి.ఎల్.పి.ఓలు, ఎంపీడీవోలు, నూతన సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దురంధర్-2 సినిమాను వీక్షించండి...

పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి పిలుపు...



షాద్ నగర్//మార్చి 24 (ఆకాంక్ష) : ప్రతి ఒక్కరూ దురంధర్-2 చిత్రాన్ని వీక్షించాలని బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి కోరారు. ఈరోజు రామకృష్ణ థియేటర్లో బిజెపి నాయకులు, కార్యకర్తలతో కలిసి సినిమాని వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దురంధర్ సినిమా వాస్తవిక జాతీయ భావజాలాన్ని ప్రతిబింబిస్తుందని, సినిమా చూసి పాకిస్తాన్ భారత్ పై చేసిన కుట్రలను యువత గమనించాలని ఆకాంక్షించారు. సినిమా వీక్షించిన వారిలో బిజెపి నాయకులు ఇస్నాతి శ్రీనివాస్,చేగు సుధాకర్ అప్ప, అత్తపురం మహేందర్ రెడ్డి, అనిల్ కుమార్ గౌడ్, కుడుముల బాల్ రాజ్, ఇస్నాతి గంగాదర్,అనేమోని కృష్ణ యాదవ్, గణేష్ నాయక్, కడవత్ రాజు నాయక్,చెవుల బాస్కర్,హన్మంత్,ప్రశాంత్ గౌడ్,వేణు, శ్రావణ్ కుమార్ తదితరులు ఉన్నారు..

## న్యాయవాదుల రక్షణ చట్టానికి

# క్యాబినెట్ ఆమోదంపై పాలాభిషేకం...



గోదావరిఖని//మార్చి 24 (ఆకాంక్ష) : న్యాయవాదుల రక్షణ చట్టానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిన సందర్భంగా మంగళవారం గోదావరిఖనిలో కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ మేరకు కోర్టు ఆవరణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు కొప్పుల శంకర్ నాయకత్వం వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటు దిశగా రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. న్యాయవాదుల హక్కుల పరిరక్షణకు, విధి నిర్వహణలో భద్రత కల్పించేందుకు ఈ చట్టం ఎంతో ఉపయోగ పడుతుందని అన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కాంగ్రెస్ లీగల్ సెల్ నాయకులు మాట్లాడుతూ, న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, వేధింపుల నేపథ్యంలో రక్షణ చట్టానికి ఆమోదం లభించడం శుభపరిణామమని పేర్కొన్నారు. న్యాయవాదుల వృత్తి గౌరవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో గోదావరిఖని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తౌటం సతీష్,రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ వరలక్ష్మి, సీనియర్ న్యాయవాదులు మేడ చక్రపాణి, పాత అశోక్, దిశెట్టి అంజయ్య, టీపీసీసీ కార్యదర్శి ప్రకాష్, లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు మాదాసి శ్రీనివాస్, ముష్కే రవికుమార్, కాదాశి శేఖర్, పోయిల సాగర్, షానవాస్, మార్కాపురి తిలక్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూరిబా విద్యాలయంలో

# "షీ" టీమ్ అవగాహన కార్యక్రమం...

మహిళల భద్రత, సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై విద్యార్థులకు చైతన్యం...




నాగర్‌కర్నూల్//మార్చి 24 (ఆకాంక్ష) : నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్, అడిషనల్ ఎస్పీ నోముల వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కోడేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో మంగళవారం "షీ" టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాల నివారణతో పాటు విద్యార్థుల్లో చట్టాలపై చైతన్యం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా "షీ" టీమ్ ఏఎస్ఐ విజయలక్ష్మి మాట్లాడుతూ, మహిళలపై జరుగుతున్న వేధింపులు, నేరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించవద్దని, ఇలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, "షీ" టీమ్ సహాయ నంబర్ 181, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930 నంబర్‌ను వినియోగించాలని విద్యార్థులకు వివరించారు.అదేవిధంగా సీసీ కెమెరాల ప్రాధాన్యం, బాల్య వివాహాల దుష్పరిణామాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన,కమ్యూనిటీ పోలీసింగ్ అవసరం, మానవ అక్రమ రవాణాపై అప్రమత్తత వంటి అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. మద్యపాన నిషేధం, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, బ్యాంకింగ్ మరియు ఆన్‌లైన్ మోసాల నుండి ఎలా రక్షించుకోవాలో కూడా వివరించారు.పోక్సో, నిర్భయ చట్టాలపై కూడా విద్యార్థినీ, విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పిస్తూ, చిన్న వయస్సులోనే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా సమాజంలో బాధ్యతగల పౌరులుగా ఎదగవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భరోసా సభ్యులు గాయత్రి, కేజీబీవీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ వరలక్ష్మి, అధ్యాపక బృందం, "షీ" టీమ్ సభ్యులు వెంకట్రాములు, వెంకట్ నాయక్‌తో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.జిల్లా పోలీస్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడంతో పాటు మహిళల రక్షణ, సైబర్ భద్రత, సామాజిక బాధ్యతల పట్ల చైతన్యం కలిగించిందని పాఠశాల వర్గాలు అభిప్రాయపడ్డాయి.

# ఆర్టీసీ బలోపేతానికి విద్యుత్ బస్సులు ఆర్టీసీకే ఇవ్వాలి...




గోదావరిఖనిటౌన్//వమార్చి 24 (ఆకాంక్ష) : విద్యుత్ బస్సులను ఆర్టీసీకే కేటాయించి ప్రజా రవాణా సంస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బస్ డిపోల ముందు నిరసనలు నిర్వహించారు. అందులో భాగంగా గోదావరిఖని బస్ డిపో ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టగా, ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘం మద్దతుగా పాల్గొంది.ఈ సందర్భంగా నాయకులు వేల్పుల కుమారస్వామి, ఈ. నరేష్ మాట్లాడుతూ, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీలో కార్మిక సంఘాలకు అనుమతి కల్పిస్తామని, కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటివరకు ఆ హామీల అమలుకు చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని విమర్శించారు.ఆర్టీసీ కార్మికులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ వాటిని వినే పరిస్థితి లేకుండా పోయిందని, సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ బస్సుల అమలులో ఆర్టీసీకి ప్రాధాన్యం ఇవ్వకుండా దేశీయ, అంతర్జాతీయ ప్రైవేట్ పెట్టుబడి దారులకు లాభాలు చేకూరే విధంగా విధానాలు రూపొందిస్తున్నారని అన్నారు.విద్యుత్ సబ్‌స్టేషన్లు,మౌలిక వసతుల కల్పన పేరుతో ఆర్టీసీకి చెందిన భూములను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 2019 మోటారు వాహనాల చట్టం, అలాగే విద్యుత్ బస్సుల విధానం కారణంగా ఆర్టీసీకి తీవ్ర నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.జీసీసీ విధానాన్ని రద్దు చేసి, ప్రస్తుతం ప్రైవేట్ సంస్థలకు ఇస్తున్న అన్ని రకాల సబ్సిడీలను ఆర్టీసీకే మళ్లించాలని, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ, లేనిపక్షంలో భవిష్యత్తులో మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టి. నరహరి రావు, కృష్ణ, మల్లయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు రాజేశం, కొమురయ్యలతో పాటు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు పి. రంగన్న, మద్దెల శ్రీను, టి. శ్రీను, ఏ.బి. స్వామి, డి.ఆర్. స్వామి, జి. శ్రీను, సమియేల్, సదయ్య, చంద్రయ్య, ప్రసాద్, కె. రవి, పి. రాజయ్య, పాషా, ఐలన్న, కె.కె. రాజు, బిక్షపతి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# సలేశ్వరం జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి...





నాగర్‌కర్నూల్//మార్చి 24 (ఆకాంక్ష) : ఏప్రిల్ 1 నుంచి 3వ తేదీ వరకు జరిగే ప్రముఖ సలేశ్వరం జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్ లాల్, డీఎఫ్‌వో రేవంత్ చంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు, సలేశ్వరం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి జాతర ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ, ఈసారి సలేశ్వరం జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా అన్ని సదుపాయాలు సిద్ధం చేయాలని సూచించారు.ఏప్రిల్ 1 నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు భక్తులను అనుమతించనున్నట్లు తెలిపారు. ఫర్హాబాద్ నుంచి లోపలికి అనుమతి ఉంటుందని, భక్తులు ఈ విషయాన్ని గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.జాతరకు వచ్చే భక్తులకు ప్రమాదవశాత్తు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అటవీశాఖ సిబ్బందితో కలిసి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో నడిచి వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా మార్గమధ్యంలో సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట డిపోల నుంచి విరివిగా ఆర్టీసీ బస్సులు నడపాలని నాగర్‌కర్నూల్ డీఎంకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే వైద్యశాఖ తరఫున పలు చోట్ల ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేసి, వైద్య సిబ్బంది, అంబులెన్సులు 24 గంటలపాటు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. కింద గుండం వద్ద ప్రత్యేక వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు.వేసవి కాలం కావడంతో తాగునీటి సమస్యలు తలెత్తకుండా భక్తులకు తగినన్ని తాగునీటి సదుపాయాలు కల్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే జాతరకు వచ్చే వాహనాలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తకుండా పోలీస్, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో పార్కింగ్, వాహనాల అనుమతి అంశాలను సమర్థంగా నిర్వహించాలని చెప్పారు.స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమాల్లో అడవిలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మరో రెండు రోజుల్లో అన్ని శాఖల అధికారులతో కలిసి తానే స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి, ఏర్పాట్లు పకడ్బందీగా జరుగుతున్నాయా లేదా పరిశీలిస్తానని తెలిపారు.జాతర మార్గం అటవీ ప్రాంతంలో కఠిన పరిస్థితులతో కూడుకుని ఉండటంతో గర్భిణీ మహిళలు, వృద్ధులు, శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఉన్న భక్తులు సలేశ్వరం జాతరకు రాకపోవడం మంచిదని కలెక్టర్ సూచించారు. భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. సలేశ్వరం జాతరను సజావుగా, భద్రంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని వెల్లడించారు. అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, చెంచు సంఘాల నాయకులు పోలీస్ శాఖకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఎస్పీ కోరారు. సలేశ్వరం జాతరను అత్యంత పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, వివిధ శాఖల అధికారులు, సలేశ్వరం ఆలయ కమిటీ సభ్యులు, చెంచు సంఘాల నాయకులు లింగస్వామి, గురువయ్య, ఈర్లపెంట సర్పంచ్ శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం, రాష్ట్రం వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరుబాట...

గ్యాస్ గోదాముల వద్ద క్యూ లైన్లే కొరతకు నిదర్శనం...

గ్యాస్ కొరతపై గన్‌పార్క్ నుంచి అసెంబ్లీ వరకు

బీఆర్ఎస్ నిరసన...




షాద్‌నగర్//మార్చి 24 (ఆకాంక్ష) : రాష్ట్రంలో వంటగ్యాస్ కొరతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు వాస్తవ పరిస్థితులను చెప్పకుండా మభ్యపెడుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మంగళవారం గన్‌పార్క్ అమరవీరుల స్తూపం నుంచి అసెంబ్లీ వరకు బీఆర్ఎస్ నేతలు భారీ నిరసన చేపట్టారు.ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ఒకవైపు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదని చెబుతోందని, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉందన్నారు. గ్యాస్ గోదాముల వద్ద ప్రజలు భారీ క్యూ లైన్లలో నిలబడుతున్న దృశ్యాలు రోజూ కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్రం తగినంత గ్యాస్ సరఫరా చేయడంలో సహకరించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకుంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని, మరోవైపు కేంద్ర ప్రభుత్వం కూడా కొరత లేదని చెబుతూ ప్రజలను అయోమయంలోకి నెట్టేస్తోందని కేటీఆర్ విమర్శించారు. వాస్తవ సమస్యను అంగీకరించి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన సమయంలో పరస్పర ఆరోపణలతో కాలయాపన చేయడం సరికాదన్నారు.ప్రజలు రోజువారీ అవసరాల కోసం ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వాలు మాత్రం ప్రకటనలకే పరిమితమవుతున్నాయని, గ్యాస్ సరఫరా వ్యవస్థలో నెలకొన్న లోపాలను వెంటనే సరిదిద్దాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, సరఫరా లోటుపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని నాయకులు కోరారు.నిరసనకారులు గన్‌పార్క్ నుంచి అసెంబ్లీ వరకు నినాదాలు చేస్తూ ముందుకు సాగగా, గ్యాస్ కొరతపై ప్రభుత్వాలు సమగ్ర నివేదిక విడుదల చేయాలని, సరఫరా వ్యవస్థను సాధారణ స్థితికి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనతో అసెంబ్లీ పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను సభలోనూ, సభ బయటా బలంగా వినిపిస్తామని, గ్యాస్ కొరత పరిష్కారానికి స్పష్టమైన చర్యల ప్రణాళిక ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

# టిబి నియంత్రణలో రాష్ట్రంలో మొదటి స్థానం...




నాగర్ కర్నూల్//మార్చి 24 (ఆకాంక్ష) : ప్రపంచ టిబి నియంత్రణ దినోత్సవం సందర్భంగా గాంధీ మెడికల్ కాలేజీ పరిధిలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా టిబి నియంత్రణలో రాష్ట్రంలో మొదటి స్థానం సాధించి విశేష గుర్తింపు పొందింది. జిల్లాలో టిబి నిర్మూలనకు వైద్యశాఖ చేపట్టిన సమర్థవంతమైన చర్యలు ఈ ఘనతకు ప్రధాన కారణమయ్యాయి.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శ్రీమతి సంగీత సత్యనారాయణ, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డా. రవీంద్ర నాయక్ హాజరయ్యారు. టిబి నిర్మూలన దిశగా విశేష సేవలు అందించినందుకు నాగర్ కర్నూల్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. రవి కుమార్ నాయక్, ప్రోగ్రామ్ అధికారి శ్రీ రఫీక్‌లను ప్రత్యేక అవార్డులతో సత్కరించారు. జిల్లాలో గ్రామస్థాయి వరకు వైద్య సేవలను విస్తరించడం, టిబి బాధితులను ప్రారంభ దశలోనే గుర్తించడం, వారికి పూర్తి స్థాయి చికిత్స అందించడం, నిరంతర పర్యవేక్షణ చేపట్టడం వంటి అంశాలలో నాగర్ కర్నూల్ జిల్లా మెరుగైన పనితీరు కనబరిచినట్లు అధికారులు వెల్లడించారు. టిబి వ్యాధి నిర్మూలనలో ప్రజల్లో అవగాహన పెంచడం, ఆరోగ్య సిబ్బంది క్రమబద్ధమైన సేవలు అందించడం, బాధితులకు అవసరమైన వైద్య సహాయం అందుబాటులో ఉంచడం ద్వారా జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది.ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. రవి కుమార్ నాయక్ మాట్లాడుతూ, టిబి నియంత్రణలో రాష్ట్రంలో మొదటి స్థానం సాధించడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. ఈ గుర్తింపు వైద్య సిబ్బంది అంకితభావం, కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. టిబి రహిత సమాజం నిర్మాణం కోసం మరింత కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా సాధించిన ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు వైద్య ఆరోగ్య శాఖకు మరింత ఉత్సాహాన్ని నింపగా, జిల్లాను టిబి రహితంగా తీర్చిదిద్దే దిశగా అధికారులు మరింత శ్రమించాల్సిన అవసరాన్ని కూడా స్పష్టంచేసింది. ప్రపంచ టిబి నియంత్రణ దినోత్సవం సందర్భంగా వచ్చిన ఈ అవార్డు జిల్లాలోని వైద్య సిబ్బందికి ప్రోత్సాహకరంగా మారింది.

# పేదోడి గూడు అగ్నికి ఆహుతి...

కన్నీరు మిగిల్చిన షార్ట్‌సర్క్యూట్...

రోడ్డున పడ్డ రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం...

ఇద్దరు ఆడబిడ్డలతో నిరాశ్రయులైన దంపతులు...

ఆదుకోండి... అన్నీ కోల్పోయిన కుటుంబం ఆవేదన...






షాద్‌నగర్//మార్చి 24 (ఆకాంక్ష) : రెక్కాడితే గానీ డొక్కాడని ఓనిరుపేద కుటుంబాన్ని విధి ఒక్కసారిగా వీధిన పడేసింది. హమాలీ పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న భర్త, ఇళ్లల్లో పనులు చేస్తూ తోడ్పడుతున్న భార్య... ఇద్దరి చెమటోడ్చిన చిన్న చిన్న సంపాదనతో ఇద్దరు కుమార్తెల భవిష్యత్తును చక్కదిద్దాలని కష్టపడుతున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ రూపంలో విపత్తు వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేసింది. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని నెహ్రూ కాలనీ 19వ వార్డులో మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటన స్థానికులను కలచివేసింది.నెహ్రూ కాలనీకి చెందిన పిట్టల శీను, విజయలక్ష్మి దంపతులు కేవలం 40 గజాల చిన్న సిమెంట్ రేకుల షెడ్డు ఇంటిలో నివసిస్తున్నారు. శీను హమాలీ పనులు చేసుకుంటూ వచ్చిన కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తుండగా, విజయలక్ష్మి నాలుగు ఇళ్లలో పని చేస్తూ కుటుంబ భారం మోస్తోంది. వచ్చిన చిన్న ఆదాయంతోనే పెద్ద కుమార్తెను ఇంటర్మీడియట్, చిన్న కుమార్తెను ఐదో తరగతి చదివిస్తూ బతుకుబండిని లాగుతున్నారు. ఇలాంటి సమయంలో వారికున్న ఏకైక ఆశ్రయం అయిన చిన్న ఇంటిలో అకస్మాత్తుగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి.ఇల్లు చిన్నగా ఉండటంతో మంటలు నిమిషాల వ్యవధిలోనే వ్యాపించి మొత్తం గృహాన్ని ఆవహించాయి. చుట్టు పక్కల వారు పరుగున చేరుకొని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే పరిస్థితి అదుపుతప్పిపోయింది. చివరికి ఇల్లు పూర్తిగా కాలి బూడిదైంది. ఇంట్లోని బీరువాలో దాచుకున్న మహిళా సంఘానికి సంబంధించిన రూ.60 వేల నగదు, బట్టలు, వంట సామాన్లు,నిత్యావసర సరుకులు, బియ్యం, ఇతర విలువైన పత్రాలు అన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. కట్టుకున్న బట్టలు మినహా కుటుంబానికి ఏమీ మిగల్లేదు. ఒక్కసారిగా ఇల్లు, పొదుపు అవసరమైన సామగ్రి అన్నీ కోల్పోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఏం చేయాలో, ఎటు వెళ్లాలో తెలియని దిక్కుతోచని స్థితిలో భార్యాభర్తలు కన్నీరు మున్నీరయ్యారు. సంఘటనా స్థలంలో వారు విలపిస్తున్న తీరు చూసి స్థానికులు కూడా చలించిపోయారు. పేదరికంతో పోరాడుతూ పిల్లల చదువు కోసం కష్టపడుతున్న కుటుంబానికి ఇలాంటి విపత్తు రావడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన విషయం తెలుసుకున్న 19వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ ఎజాజ్ (అడ్డు) వెంటనే స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించారు. దీంతో మున్సిపల్ చైర్మన్ అంగనూరు బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కౌన్సిలర్లు మురళీమోహన్ అప్పి, రాజు నాయక్, పెంటయ్య, మాజీ కౌన్సిలర్లు రాజేందర్ రెడ్డి, పాలమాకుల చెన్నయ్య, యువ నాయకుడు డాకన్నగారి మనీష్, భాస్కర్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఓదార్చారు. కాలిన ఇంటిని పరిశీలించిన వారు కుటుంబానికి ఎదురైన నష్టాన్ని చూసి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అంగనూరు బసవేశ్వర్ తనవంతు సాయంగా తక్షణం రూ.5 వేల నగదు అందజేశారు. అలాగే మాజీ కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి స్పందించి సంఘటనా స్థలంలోనే రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కష్టాల్లో ఉన్న ఈ కుటుంబానికి అందరూ తోడుగా నిలవాలని పిలుపు నిచ్చారు.ఈ ఘటనపై మానవతా దృక్పథంతో స్పందించాలని పలువురు స్థానికులు, సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు. హమాలీ పనులతో జీవనం సాగిస్తున్న పిట్టల శీను కుటుంబం ఒక్కసారిగా అన్ని కోల్పోయి నిరాశ్రయంగా మారిందని, దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, సేవా మనసున్న వారు ముందుకు వచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం ఈ కుటుంబానికి తక్షణ అవసరాలైన దుస్తులు, ఆహార సరఫరా, గృహోపకరణాలు, విద్యా సామగ్రి, ఆర్థిక సహాయం అత్యవసరంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు.బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలనుకునే దాతలు 8186095968 నంబర్‌కు గూగుల్ పే లేదా ఫోన్‌పే ద్వారా సహాయం చేయవచ్చని కుటుంబ సభ్యులు తెలిపారు. ఒక్కసారిగా అగ్నిప్రమాదంతో జీవితాధారం కోల్పోయిన ఈ పేద కుటుంబాన్ని ఆదుకోవడం సమాజ బాధ్యతగా మారింది. చిన్న సహాయం కూడా వారికి పెద్ద ఆపన్నహస్తంగా మారనుంది.